గోతెలుగు.కామ్

చక్కటి కుటుంబ వార పత్రిక

# సెప్టెంబర్ 2015
# కథలు




గీత బడికి బయలుదేరడానికి తయారయ్యింది. తనకు కావాల్సినవన్నీ ఉన్నాయో.. లేదో..! అని మరొక సారి స్కూల్ బ్యాగు తెరచి చూసుకుంది. కనులు మిల మిలా మెరిసాయి. పెదవులపై చిరునవ్వు.. అన్నీ ఉన్నాయనే చెబుతోంది.

“అమ్మా నేను వెళ్ళొస్తా..” అనుకుంటూ ప్రధాన గుమ్మం దాటింది. ఎలాగైనా అమ్మ ‘సరే’ అంటుందనే ధీమాతో..

గీత ప్రభుత్వ పాఠశాలలో ఐదవ తరగతి చదువుతోంది. తనకు ఆ పాఠశాల అంటే ఎంతో ఇష్టం. యింకా తెలుగు మాస్టారు పాఠాలతో బాటు దైవభక్తిని ప్రభోదించే సూక్తులు మరీ మరీ యిష్టం.

ఒక రోజు తెలుగు మాస్టారు పాఠం చెబ్తుంటే వరండా గుండా ఒక కోతి పరుగెత్తుకుంటూ వెళ్ళింది. అప్పుడప్పుడు అలా వెళ్లడం మామూలే.. దాన్ని చూడగానే పిల్లలంతా కేరింతలు కొడుతూ ‘కోతి.. కోతి..’ అంటూ అరవడం కూడా మామూలే.. కాని అది తెలుగు మాస్టారి క్లాసు కావడమే విశేషం..

మాస్టారు 'సైలెన్స్..! సైలెన్స్..!!' అంటూ విద్యార్థుల వంక చిరు కోపం ప్రదర్శించాడు.

"మీకో కథ చెబుతాను" అని మాస్టారు అనగానే క్లాసు సద్దుమణిగింది.

మాస్టారు గొంతు సవరించుకొని కోతిని 'వానరము' అని పిలవాలని.. అలనాడు శ్రీరామ చంద్రునికి అత్యంత ప్రీతి పాత్రమైన సేవకుడు అయిన ఆంజనేయ స్వామి వారసులు.. అని చెబుతూ వానరులు శ్రీరామ చంద్రనికి చేసిన సహాయము, వారి స్వామిభక్తి, భుజశక్తి గురించి వివరించాడు. గీత మనోఫలకంపై వానరం ముద్ర బలంగా నాటుకు పోయింది.

ఆనాటి నుండి వానరాన్ని మచ్చిక చేసుకోవాలనుకుంది.

ఆమరునాడు దానికి అత్యంత ప్రీతిపదమైన అరటి పండు తన స్కూల్ బ్యాగులో దాచుకొని తెచ్చింది. దారిలో బడి ప్రక్కనే ఉన్న చెట్టు మీద కూర్చునే వానరాన్ని చూసి 'స్వామి రా..! రా..!!' అంటూ పిలిచింది. అరటి పండు చెట్టు మొదట్లో పెట్టింది. అది చెట్టు దిగి వచ్చి తింటూ వుంటే దాని బుగ్గలు ఉబ్బటం చూస్తూ ఎంతగానో మురిసి పోయింది.

కొద్ది రోజులకు 'స్వామి రా..! రా..!!' అంటే తననే పిలుస్తున్నట్లు గీత వద్దకు వానరం ఛెంగు, ఛెంగున పరుగెత్తుకు రావడం.. గీత యిచ్చే అరటి పండు తినడం.. అలా వారి స్నేహం దినదినాభివృద్ధి చెందసాగింది.

వీరి స్నేహం చూసి ఈర్ష్యపడే వాడు రాజు. 'ముందు వచ్చిన చెవులకన్నా వెనుక వచ్చిన కొమ్ములు వాడి' అన్నట్లు తాను ఎన్నాళ్ళుగానో గీత కు బెస్ట్ ఫ్రెండ్.. గీత, తాను ప్రతీ రోజూ చాక్లెట్లు యిచ్చి పుచ్చుకుంటారు.. పైగా క్లాస్‌మేట్ కూడానూ.. అయినా వానరాన్ని చూసి సంతోషించినంతగా తనను చూసి సంతోషించడం లేదనే అపోహ రాజు మనసులో అంకురించింది. గీత తఱచుగా వానరం గురించి చెబ్తుంటే 'పిచ్చి బాగా ముదిరి పోతోంది..' మనసులో అనుకుంటూ నుదురు సుతారంగా బాదుకునేవాడు.

ఒక రోజు గీత ఎప్పటిలాగే వానర స్వామిని పిలిచి అరటి పండు ఒలిచి యిచ్చింది. అది తింటూవుంటే మైమరచి చూస్తోంది.. వెనుక నుండి పిల్లిలా వచ్చిన ఒక దొంగ పిల్ల వాడు గీత మెడలోని బంగారు గొలుసును తెంపుకొని పరుగెత్త సాగాడు. రాజు భయపడిపోయి

చెట్టు వెనకాలకు వెళ్ళి దాక్కున్నాడు. గీత గజ గజ వణక సాగింది. నోట మాట రావడం లేదు.. భయం భయంతో లేని శక్తిని కూడగట్టుకొని బడి వైపు పరుగు తీసింది. ఎదురుగా తెలుగు మాష్టారు కనబడగానే అమాంతంగా రెండు కాళ్ళనూ చుట్టేసుకుని బిగ్గరగా ఏడ్వసాగింది.. మాస్టారు ధైర్య వచనాలతో కాసేపయ్యాక తేరుకుని జరిగిన విషయం చెప్పింది. తన పుట్టిన రోజున అమ్మ కానుకగా యిచ్చిన ఆ గొలుసు అంటే తనకు ఎంతో యిష్టమని చెబుతూ వెక్కి వెక్కి ఏడ్వ సాగింది. పిల్లలంతా గీత చుట్టు గుమిగూడారు.

"నీ వెంట రాజు ఉండాలిగా.. ఏమయ్యాడు?" అని మాస్టారు అడుగుతుండగా వచ్చాడు రాజు.

"వాని చేతిలో కత్తి ఉంది సార్.." అంటూ తాను చూసిన భయోత్పాదక దృశ్యాన్ని కళ్ళకు కట్టినట్లు చెప్పసాగాడు.

యింతలో వానర స్వామి బడి ప్రహరీ గోడ మీదుగా మూడు కాళ్ళతో గెంతుకుంటూ వస్తోంది.. దాని చేతిలో గీత గొలుసు..

పిల్లలంతా చప్పట్లతో కేరింతలు..

వానర స్వామి తన చేతిలోని గొలుసును గీత పైకి విసిరేసి తనూ చప్పట్లు కొట్టసాగింది. గొలుసు యాదృచ్చికంగా గీత మెడలో పడింది.

మాస్టారు స్వామిని రెండు చేతులా నమస్కరించడం చూసి పిల్లలంతా అనుసరించారు..

ప్రణమిల్లుతున్న గీత కళ్ళళ్ళో కృతజ్ఞతాశృవులు జల, జలా కారసాగాయి…

'గీతకు నిజమైన స్నేహితుడను కాను.. కనీసం దొంగ.. దొంగ.. అంటూ కూడా తాను అరవలేదు… యికముందు అలా చేయగూడదు..' అని రాజు మనసులో బాధ పడుతుంటే.. గీత, వానర స్వామిల స్నేహంపై వున్న ద్వేషము క్రమేణా తొలగి పోసాగింది…

వెళ్ళిపోతున్న వానరాన్ని చూస్తూ "స్వామీ.. రా..!..రా..!!" అంటూ రాజు గంతులు వేస్తూ పిలువ సాగాడు.

బడి గంట మోగింది..

పిల్లలంతా రాజు పిలుపును వల్లె వేస్తూ ప్రార్థనకై పరుగులు తీశారు. ***




ఆకులు రాలిన అడవిలాగున్నాడు చెంచయ్య. కళ్ళల్లో తడి, గుండెల్లో అలజడి. పదే పదే దగ్గుతూ ఆయాసపడుతోన్న భార్యను చూస్తూ నిట్టూర్చాడు. ఊపిరితిత్తులు దెబ్బతిని, శ్వాస సరిగా తీసుకోలేకపోతుందామె. సాధ్యమైనంత త్వరగా ఆపరేషన్ చేయాలని డాక్టర్లు హెచ్చరించారు. ఆ ఆలోచనలతో మునిగిపోయి, గతాన్ని గుర్తు చేసుకోసాగాడు.

*　　　*　　*

మనిషి బతుకు చారెడు సుఖం, పుట్టెడు దు:ఖం. చెంచయ్య ఏనాడు చారెడు సుఖానికి నోచుకోలేదు. బాల్యంలో పాలబుగ్గల జీతగాడు. పెద్దయ్యాక మీసం వచ్చిన పనోడు. పెళ్ళయ్యాక కొమ్ములు తిరిగిన కూలోడు. సూటిగా చెప్పాలంటే కరువు, కాటకాల మీద నిలిచిన మొనగాడు.

వారసత్వంగా వచ్చిన రెండెకరాలు తండ్రి అప్పులకు అహుతి కాగా, ఒక గుడిసె, రెండు ఆవులు మిగిలాయి. ఒకటి తెల్లావు, మరొటి ఎర్రావు. ఆ నోరు లేని జీవాలే చెంచయ్యకు చేదోడు, వాదోడుగా నిలబడ్డాయి. పాలు ఇచ్చాయి, అరక దున్నాయి. వాటి సాయంతోనే పెంకుటిల్లు కట్టాడు. ఎకరం భూమి కొన్నాడు. రోజులు అలా నెమ్మదిగా సాగుతున్నాయో లేదో ఒక్కగానొక్క కూతురు పెళ్లికొచ్చింది. కూతుర్ని అత్తవారింటికి పంపటానికి ఉన్న ఎకరం భూమి అమ్మక తప్పలేదు. ఘనంగా కాకపోయినా

ఉన్నంతలో బాగానే చేశాడు పెళ్లి.   గుండెల మీద కుంపటి దిగిపోయిందని ఊపిరి పీల్చుకున్నాడు.

ఊహించని వాటిని ఉత్పత్తి చేస్తుంది కాలం. సంవత్సరం గడువక ముందే అదనపు కట్నం వేధింపులు గ్యాస్ సిలిండర్ రూపంలో కూతుర్ని బలి తీసుకున్నాయి. కటిక చేదు వార్తను తట్టుకోలేక విలవిల్లాడారు చెంచయ్య, అతని భార్య. కాలం గడుస్తున్నా కొద్దీ చెంచయ్య ఒంట్లో బలం తగ్గసాగింది. మళ్లీ ఆవులే కన్న బిడ్డల్లా తోడు నిలిచాయి. అరక దున్నడానికి ఆవులను కిరాయికి ఇస్తూ, దానిపై వచ్చే డబ్బులతో కలో, గంజో తాగుతున్నాడు.   భార్య దగ్గుతుండటంతో   మళ్ళీ వర్తమానంలోకి వచ్చాడు చెంచయ్య.

*   *   *

రాత్రైంది. గుడ్డి దీపం మసక మసకగా వెలుగుతోంది. నులక మంచంలో నిలువు గుడ్లేసాడు చెంచయ్య. భార్య సేవలను తలచుకోసాగాడు. 'నా కోసం ఎన్నో త్యాగాలు సేసింది. ఆపరేషన్ ఎలాగైనా సేయిద్దామంటే సేతిలో సిల్లిగవ్వ లేదే? యెలా?' కళ్ళు ఊరి చివర రాముడి చెరువు తూములను తలపిస్తుంటే, మంచంల్లోంచి లేచి బయటకు వచ్చాడు. అల్లంత దూరంలో నెమరేస్తున్న ఆవులు. ప్రతి రోజూ చూస్తున్నవే కాని ప్రస్తుతం చెంచయ్య కళ్లను వెలిగించాయి.

మెల్లగా ఆమె మంచం దగ్గరకు వెళ్ళాడు. "సుజాతా!" అని పిలిచాడు.

"యేం...ద...య్యా! " దగ్గుతూ పైకి లేచి కూర్చుంది."నీ అవస్థ సూస్తుంటే నా గుండె పగిలేలా ఉందే. సంసారం కోసం నాతో కల్సి యెన్ని సెరలుబడ్డవ్. గంజినీళ్ళు కూడా కడుపు నిండా తాగని రోజులున్నయ్! కంటికి రెప్పలా సాదిన బిడ్డెల్లిపోయింది. ఇక మీదట నువ్వు లేకుంటే, గీ భూమ్మీద నెనెలా గుంటానే? నాకో ఉపాయం తట్టింది. ఆవులనమ్మి, డబ్బు తెస్తా! దవాఖానాలో సూపిస్తానే!" తువ్వాలుతో కళ్లొత్తుకోసాగాడు."మూగ జీవాలే అయినా మన కన్న బిడ్డలనుకున్నాం! మన మీ రోజుకీ గుక్కెడు మెతుకులు గతుకుతున్నామంటే వాటి దయే గదయ్యా! ఆ మాటంటానికి నోరెలా వచ్చింది!" బాధగా అన్నదామె."ఒక్కోపాలి మనసుకు బరువనిపించినా కొన్ని పన్లు సేయక తప్పదే! నువ్వు ఊరిక్కినే మనాది పెట్టుకోమాకా! జాగ్రత్తగుండు. త్వరగానే వస్తాలే!" అన్నాడు. పది కిలోమీటర్ల దూరంలోనున్న సిటికి అర్థరాత్రి నడక మొదలెట్టాడు. తనకు అత్యంత ఇష్టమైన ఆవులతో.

*   *   *

చీకట్లను తరుముతున్న వెలుగులు సిటిని వెలిగిస్తుండగా సిటి పొలిమేరల్లోకి ప్రవేశించాడు. చెంచయ్యకు సిటి గురించి పెద్దగా తెలిదు. గతంలో చాలా సార్లు వచ్చినా, బస్టాండులో బస్సు దిగి, భారతమ్మ కిరాణంలో రెండు నెలలకు సరిపడా సరుకులు కొనుక్కొని తిరిగి వెళ్ళటం తప్పితే మరో వీధిలోకి పోలేదు.      ఆ అవసరం రాలేదు. ఆవులను ఎక్కడ కొంటారో తెలిదు. రాత్రి నడక వల్ల బాగా నీరసించాడు. పైగా ఆకలితో కూడా ఉన్నాడు. ఆవులను చెట్టుకు కట్టేసాడు. పక్కనే ఉన్న సిమెంట్ బల్లపై కూర్చున్నాడు. ఎదురుగా చిన్న హోటల్ కనిపించింది. హోటల్ ముందున్న టబ్బులోని నీళ్ళతో ముఖం కడుక్కొని, కౌంటర్ దగ్గరకు వెళ్ళాడు.

"అయ్యా! యిడ్లీ యెంత?" జేబులు తడుముకుంటూ అడిగాడు.

"ప్లేటు ఇరవై!"

"అబ్బో! యి..ర..వైయా!" జేబులు వెతికిన చేతిని చూసుకున్నాడు. రెండ్రూపాయల బిళ్ళ తెల్లగా మెరుస్తోంది. "ప్చ్...!" నిట్టూర్పు విడుస్తూ వెనుదిరిగాడు.

ఆ పెద్దాయనను చూస్తే హోటల్ యజమానికి జాలి అనిపించిందో ఏమో! "అయ్యో పాపం! ఆకలితో ఉన్నట్టున్నావు. ఫర్లేదులే రా..రా! కూర్చో!" అన్నాడు.వేడి వేడి ఇడ్లీలు పల్లీ చెట్నీతో గబ గబా తిన్నాడు. రెండు బాటిళ్ళ నీళ్లు గట గటా తాగాడు. "బ్రేవ్...!"మని తేపాడు. "దేవుడు సల్లంగ సూడాలయ్యా!" అంటూ హోటలతను వద్దంటున్నా రెండ్రూపాయలు చేతిలో పెట్టి బయటకు వస్తూ, టక్కున ఆగాడు."అయ్యా! అగో యెదురుంగా సెట్టు కిందున్నాయే గయి నా ఆవులేనయ్యా! అమ్మటానికి తోలుకొచ్చిన, ఆట్ని యెక్కడ కొంటరో నీకేమైనా తెలుసాయ్యా!""అవునా! ఇదే బజారు చివరకు పోయి, కుడి వైపుకి తిరుగు, అక్కడ నుంచి నాలుగడుగులేస్తే పెద్ద రేకుల షెడ్ కనపడుతుంది. దాంట్లోకెళ్లు కొంటారు"

"మంచిదయ్యా!" చేతులు జోడించి హోటలతనికి నమస్కారం చేసాడు. గుర్తుల ప్రకారం రేకుల షెడ్డుకు చేరుకున్నాడు. మంచి బేరం పలికాయి ఆవులు. నలభై వేల రూపాయలిచ్చారు. చెంచయ్య ఆనందానికి అవధుల్లేవు. ఒకటికి రెండు సార్లు లెక్క చూసుకుంటున్నాడు. ఈలోపు పిల్లి గడ్డం, రింగుల జుట్టు, ఎత్తు పళ్లున్నోడు తాళ్ళు తీసుకొచ్చి ఆవుల మెడకు కట్టాడు. కాకి రంగున్నోడు కాళ్ళపై కొడ్తూ, "హయ్య్...! హయ్య్...!" మంటూ అదిలించసాగాడు.

వాటి కళ్లల్లో కన్నీటి సుడులు. చెంచయ్యను వీడలేకపోతున్నాయి. అలాగని దెబ్బలను తట్టుకోలేకపోతున్నాయి. అవి కదలకపోవడంతో వాళ్ళ కోపం తారాస్థాయికి చేరింది. బాగా కొట్టడం మొదలుపెట్టారు.

"అయ్యా! బాబూ! నోరులేని జీవాలు! గట్టిగా కొట్టమాకండయ్యా!" చెంచయ్య వేడుకోసాగాడు."ఏయ్! ముసలోడా! డబ్బు ముట్టిందిగా! నోరు మూసుకొనిపో! లేదంటవా! మా డబ్బు మా ముఖాన పడేసి ఆవులు తోలుకుపో!" కళ్లెర్ర చేశారిద్దరు.సొంత వారికి దూరమవుతున్న బాధతో విలవిల్లాడుతూ... అడుగు తీసి అడుగు వేయలేక... మెల్లగా రేకుల షెడ్డు బయటకు వచ్చాడు.

ఇంతకుముందు కూర్చున్న సిమెంట్ బల్ల దగ్గరికి వచ్చాడు. మనసంతా దిగులు పేరుకొంది. కాసేపు కూర్చొని వెళ్దామనుకున్నాడు. తెల్లావు, ఎర్రావు కళ్లల్లో మెదుల్తున్నాయి. 'నోరొక్కటే లేదు కానీ కన్నబిడ్డల కంటే మించిన సేవలు సేసాయి. యెండకు యెండాయి, ఆనకు తడిసాయి, రేయింబవళ్ళు నాతో పాటు కట్టం సేసాయే? నా డొక్కెండకుండా కాపాడిన నా తల్లుల్ని యెలా మర్సిపోవాలి? ' కుమిలిపోసాగాడు. ఇంటికి వెళ్ళలేక పోతున్నాడు. చివరిసారి ఆవులను చూసి, వాటిని మనసారా చేత్తో తడిమాలని అనుకున్నాడు. కానీ మళ్ళీ వెళ్తే కొన్నోడు ఊరుకుంటాడా? ఆ సాహసం చేయలేకపోయాడు. ఇక ఈ రోజుతో ఆవులకు తనకు రుణం తీరిందనుకున్నాడు. గుండె లోతుల్లోంచి పొంగుతున్న కన్నీటిని తుడుచుకున్నాడు. ఎదురు వీధిలో ఉన్న ఆటోస్టాండ్ గమనించాడు. ఆటో ఎక్కి బస్టాండుక్కి పోదామనుకున్నాడో ఏమో?      చిన్నగా నడవసాగాడు.

నాలుగడులేసాడో లేదో "అంబా! అంబా!" అనే అరుపులు.      గభాల్న వెనక్కి తిరిగి చూశాడు.      ముందు ఆవులు, వెనుక వాటిని కొనుకున్న వారు అతని వైపు దూసుకొస్తున్నారు.      తెల్లావు, ఎర్రావు చెంచయ్య చుట్టూ తిరగసాగాయి. మమ్మల్ని విడిచిపెట్టిపోతావా అన్నట్లు కంటతడి పెట్టసాగాయి. చెంచయ్యది సంకట స్థితి. ఆలోచనల త్రాసులో నిలబడ్డాడు. భార్య వైపా?, ఆవుల వైపా? ఎటు మొగ్గాలో తేల్చుకోలేకపోతున్నాడు. రింగుల జుట్టోడు పలుపుతాడుతో ఆవుల పక్కటెముకలపై కొడ్తుంటే చెంచయ్య తట్టుకోలేకపోతున్నాడు. ఒంటరిగా ఇంటికి వెళ్ళడం తన వల్ల కాదనుకున్నాడు. "ఆగవయ్యా! యెందుకలా కొడ్తవ్!" కాస్త కోపాన్ని ప్రదర్శించాడు.

"నోరు లేస్తుందేమిటి? అయినా ఈ ఆవులు మాటినేట్లు లేవు. మా డబ్బు మాకిచ్చేయ్!" దబాయించాడు రింగుల జుట్టోడు. చెంచయ్యకు పౌరుషం పొడుచుకొచ్చింది."యేహే! యిగ బట్టు నీ డబ్బులు యెన్నడన్న సూసినవా లేదా?" డబ్బుల సంచిని అతని చేతిలో పెట్టాడు."ముసలోడికి పౌరుషానికేం తక్కువ లేదు. ఎక్కడమ్ముతవో! అమ్ముకోపో!" తిట్టుకుంటూ వెళ్ళిపోయాడు రింగుల జుట్టోడు.పరిస్థితి మొదటికొచ్చింది. ఉన్నట్లుండి చెంచయ్యకు పెళ్లి నాడు భార్య మెడలో కట్టిన పసిడి మంగళసూత్రం ట్రంకుపెట్టెలో దాచిపెట్టిన సంగతి గుర్తుకొచ్చింది. 'దాన్నమ్మి ఆపరేషన్ చేయిస్తా!' అనుకుంటుండగానే చెంచయ్య ముఖం కొట్ల శక్తిని పొందుకుంటున్నట్లు వెలిగింది. 'నేను బతికినన్ని రోజులు ఆత్మ బంధువులసొంటి ఆవులను నా దగ్గరే ఉంచుకుంటాను.' అనుకున్నాడు.అస్తమిస్తున్న పొద్దు వైపు ఉత్సాహంగా నడుస్తున్న ఆవుల వెనుక ఇంటికి బయలుదేరాడు చెంచయ్య. అతని తిరుగు ప్రయాణం ఉత్తేజంగా సాగుతోంది.

*          *       *




అదొక పెద్ద మాల్. దాన్లో కూరగాయలన్నీ ఫ్రష్ గా ఉండేట్లు చల్లని నీళ్ళు, మంచు ముక్కలూ, ఇంకా కొన్ని రకాల రసాయనాలూ కొట్టి, వాటికి ఫేషియల్స్ చేసి ఉంచారు. తమ అందాలు చూసుకుంటూన్న కూరగాయలన్నీ స్వగతం అనుకుంటూ పైకే మాట్లాడుతున్నాయిలా.      టమోటా- "ఆహా! నా అందం ముందు వీళ్ళంతా బలాదూరే! ఎంత నున్నగా ఉంది నా ముఖ బింబం! నా రంగు చూసిన వారి కళ్ళను మెరిపిస్తుంది. నేను లేందే వంటశాలలో ఏ కూరా తయారవదు కదా!" దోసకాయ అనుకుంటున్నదీ" నా రూపం, రుచి మరెవరికీ రావు. దోస దూరిన పొట్ట, దొంగ దూరిన కొంపా ఖాళీ అని, నా సాంబార్ లేక పప్పు తీటే చాలు పొట్టలోవన్నీ అరిగి ఖాళీ కడుపే అవుతుంది."వంకాయ -" 'వంకాయ వంటి కూరయూ' అని సీతమ్మ పక్కన నన్ను చేర్చారు కవులు , రుచికీ శుచికీ నా కూరే! ఒక మారు తిన్నారంటే ఇహ వదలరు. నున్నని నా రూపం శివ లింగంలా ఉంటుంది కదా! "పొట్లకాయ-" పత్యానికి నేనే ముందు కదా!శంకరుని రెండో కొడుకు నా పోలికే! శివుని మెడలో నాగ సర్పం నా పోలికే! నా గొప్ప ఎవరికీ లేదు. "బీర కాయ, కాకర కాయ, సొరకాయ , ఇంకా అన్నీ ఇలా స్వగతాలు చెప్పుకుంటూ అందరూ వినే ఉంటారని తృప్తి పడుతున్నాయి.

ఇంతలో మిరపకాయ" అదేంటే ! ఈ ఉల్లి మౌనంగా ఉంది? ఓహో రేటు పెరిగి ఎవ్వరూ కొనరని దిగాలుగా ఉన్నట్లుంది. ఐనా కంపు కొట్టే ఈ ఉల్లి ఏమని చెప్పుకుంటుందిలే పాపం, వెల నూరు దాకా వెళ్ళిందిటగా! రాత్రి మొబైల్ న్యూ స్ లో మాల్ వాలా పెట్టుకుంటే విన్నాన్లే! ఇహ ఇక్కడే కుళ్ళి కంపు కొట్టుకుంటూ డస్ట్ బిన్ లో పడాల్సిందే! ఏంటో పాపం పరాయి దేశాలకు టన్నుల కొద్దీ ఎగుమతై పోయి , స్వదేశంలో దిక్కు లేకుండా పోయింది ఉల్లికి పాపం."అంటూ సానుభూతి తెలిపింది. ఉల్లికి వళ్ళు మండింది.

దీక్షగా త్రిమూర్తుల గురించి తపస్సు ప్రారంభించింది. పూర్వ ఋషుల తర్వాత తమ గురించి తపస్సు చేసేవారు లేక చిన్నబోయి ఉన్న త్రిమూర్తులు ఒక్క గంట లోపే ఉల్లికి దర్శనమిచ్చారు." ఏం ఉల్లీ! ఏమి నీ కోరిక, మా కోసం ఇంత కాలానికి తపస్సు చేసిన నీ కోర్కె తీర్చి గాని వెళ్ళం" అని ఉల్లిని పలకరించారు."త్రిమూర్తులారా! సంతోషం. నా తపస్సుకు మెచ్చి మీరు దర్శనమివ్వడం నా భాగ్యం. ఐతే మీరొక పని చేయాలి. మా కూరగాయలన్నిట్లో ఎవరు గొప్పో చెప్పాలి." అంటూ వినమ్రంగా విన్నవించుకుంది. వెంటనే ముందుగా బ్రహ్మ" ఉల్లీ! నా బంగారు తల్లీ! నేను సృష్టి చేసిన ఈ కూరగాయలన్నిట్లో ఏది గొప్పో నేనెలా చెప్పగలను? అన్నీ నా సృష్టిలోవే కదా! నా దృష్టిలో దేని గొప్ప దానిదే!" అన్నాడు శివుడు" ఉల్లి తల్లీ ! నీ తపస్సుకు మెచ్చి నీ ఎదుట ప్రత్యక్షమయ్యానే కానీ నాకు వరాలివ్వటమే తప్ప న్యాయ నిర్ణయం చేయటం అంతగా రాదు. దానికంతా విష్ణుమూర్తే !"అన్నాడు. విష్ణుమూర్తి గొంతు సవరించుకుని "నీరుల్లీ మా తల్లీ! నీ ప్రత్యేకత వీరికి తెలిదులే!   ఓ కూరగాయలారా! మీరంతా గొప్పే, ఎందుకంటే నా కుమారుని సృష్టిలో దోషం నేనెలా ఎంచగలను?ఐతే ఉల్లికి ఒక ప్రత్యేకత ఉంది. సాధారణంగా మీరంతా ఇతర కూరగాయలతో చేరినపుడు మీ రూపం, రుచి, వాసన మారి పోవచ్చు, కానీ ఉల్లి మాత్రం తన వాసన ,రుచి, రూపం పోక పోగా మిగిలిన వాటికీ అందిస్తుంది. ఉదాహరణకు ఉల్లిని సాంబార్ లో వేస్తే దానిలో ఎన్ని కూర ముక్కలున్నా దానికి ఉల్లి రుచే వస్తుంది. ఏ కూరలో వేసినా దాని రుచిని ఉల్లి పెంచుతుంది. వళ్ళంతా వస్త్రాల వలె పొరలు కప్పుకుని భారతీయ సంస్కృతిని కాపాడుతుంటుంది.

ఉల్లికి మా మీద భక్తి ఎక్కువ, మా కోసం తపస్సు చేసింది. ఈ కాలంలో మమ్మల్నెవరూ తలంచడం లేదు, పెరిగి పోయిన కంది పప్పు ధరనూ, ప్రస్తుతం ఉల్లి ధరనూ, చదువులకై సీట్ల ధరలనూ తలంచుకునే వారే కానీ, మమ్మల్ని తలంచే వారే లేరు. అందుకే మేము ఉల్లి కోరిన కోరిక తీర్చాలని నిర్ణయించుకున్నాం, నీరుల్లి కోరుకోమ్మా తల్లీ!! దీర్ఘాయువా? ఐశ్వర్యమా? ఆరోగ్యమా?.."అంటున్న విష్ణుమూర్తిని చూసి, " మహాప్రభో ! అవన్నీ మానవులకు కానీ నాకేల? మీరు నా పట్ల చూపుతున్న అభిమానానికి కృతజ్ఞతలు. మీరే నాకు మీకు తోచిన వరాలివ్వండి చాలు." అంది."ఉల్లీ ! మా బంగారు తల్లీ! నీ 'కోరిక లేని' తనానికి మెచ్చాము. ఉల్లీ నా వలె నీకు గడ్డం ఉండు గాక! " బ్రహ్మ దీవించాడు."ఉల్లీ! నిన్ను అడ్డంగా కోస్తే చక్రము, నిలువుగా కోస్తే శంఖమూ కనిపించి నిన్ను కోసిన వారికి నేను గుర్తు వత్తును గాక" అన్నాడు విష్ణుమూర్తి. ఇహ శివుడు భోళా శంకరుడు కనుక " ఉల్లీ! నిన్నెవరు కోసినా వారికి కళ్ల నీరు కారి కళ్ళు మంటలెక్కును గాక! ఐతే ఆ కన్నీరూ కళ్ళకు మేలు చేయును గాక! నీవు రుచి కలిగి ఉండటమే కాక, నీతో చేరిన కూరలకూ రుచినిచ్చి, శరీర ఉష్ణం తగ్గించి, ' ఉల్లి చేసిన మేలు తల్లి కూడా చేయదనే పేరు పొందెదవు గాక.'!" అని దీవించాడు.

త్రిమూర్తులు ముగ్గురూ మాయమై పోయాక , కూరగాయలన్నీ "ఉల్లీ! నీ గొప్పదనం తెల్సుకోలేక ఇంతసేపూ నిన్ను తక్కువ చేసి హేళన చేసిన మమ్మల్ని మన్నించు. నీ వెలతో పోల్చుకుంటే మా వెల కొండ ముందు గులక రాయిలా, డాలరు ముందు రూపాయిలా, బంగారు బిస్కెట్ ముందు తీపి లేని డయాబిటిక్ బిస్కెట్ లా , విమానం ముందు ఎద్దుల బండిలా, కార్పొరేట్ స్కూల్ ముందు వీధి బడిలా[ ప్రభుత్వపాఠశాల}   చాలా చౌకని తెల్సుకున్నాం, మమ్మల్ని మనఃపూర్వకంగా మన్నించానంటే గానీ మేము వదలం, నీవు నీ వెలతో తెచ్చిన సునామీతో ప్రభుత్వాలే పడిపోతాయనే నిజం ఇప్పుడే గ్రహించాం తల్లీ మన్నించు" అంటూ పాదాభివందనం చేశాయి. మనమూ ఉల్లికి ఒక మారు పాదాభివందనం చేసి వెల తగ్గి మనకు అందుబాటుగా లభించాలని వేడుకుందామా!




పార్వతీదేవి వినాయకుణ్ణి వెదకుతూ కైలాశం అంతా కలయ తిరిగి చివరాఖరికి ఒక మంచు శిఖరం మూల దిగులుగా కూర్చున్న కొడుకుని సమీపించి "నాయనా! వినాయక చవితి అతి తొందరలో సమీపిస్తోంది. ముల్లోకాల్లోనూ సంబరాలు మొదలయ్యాయి. నువ్వలా దిగులుగా కూర్చున్నావేల?" మాతృ మమకారాన్ని మాటల్లో కనబరుస్తూ అంది.

"ఏం చెప్పమంటావమ్మా? ఒక తెలుగు రాష్ట్రం రెండుగా విడిపోయింది. ఇంతకుముందు అతి విశాలమైన రాష్ట్ర ప్రజలు నా నవరాత్రులు, పూజలు, నిమజ్జనం ఘనంగా చెసేవారు. ఇప్పుడు చూడు-"అని భూలోకం లోని తెలంగాణ-వైపు చూపించాడు.

"అన్నా గణేశన్నా, ప్రతి ఏడాది మేము ఎంత గొప్పగా నీకు పూజలు చేస్తమె, యాదున్నాయా? ఖైరతాబాదుల పెద్ద గణేశుణ్ణి పెట్టి ఎట్ల దూమ్..దాం చేస్తామ్, మన హుస్సేన్ సాగర్ల నిన్ను నిమజ్జనం చెయ్యనీకి ఎంత ఘనంగా ఏర్పాట్లు చేస్తామ్. రోడ్లన్నీ జామ్ చేసి

గులాల్ చల్లుకుంటా ‘గణపతి పప్ప మోరియా..’ అంటూ ఎంత లొల్లి చేస్తామ్. అన్నీ యాద్ తెచ్చుకో, గా ఆంధ్రోల్లు మనకాడి కెంచి ఎళ్లిపోయిన్రు. గిది మొదటి పండుగ మాకు. కొత్త రాష్ట్రంల ఈసారి మరింత మస్తుగా నీ పూజ చేస్తామ్. నువ్వీసారి మొదాలు మా తెలంగాణకు రావాలె. యాదుంచుకో..ఆఁ.." అన్నాడు భక్తిప్రపత్తులతో నృత్యం చేస్తూ.

పార్వతీదేవి కొడుకు వంక ఆశ్చర్యంగా చూసింది.

‘ఇప్పుడు ఇటు చూడు-’అని ఆంధ్రవైపు చూపించాడు-

"అయ్యా, విఘ్ననాయక వినాయకా! ప్రతి సంవత్సరం నీ పూజలు మాకు తోచినంతలో ఎంత ఘనంగా చేస్తామయ్యా? ఈసారి ఇదిగో ఇలా ఉమ్మడికుటుంబం కాస్తా ముక్కలు చెక్కలయ్యింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ గా విడిపోయింది. కారణమేమయితేనేం కలిసుండలేకపోయాం. అయినా నీ పూజలో ఏలోటూ రానివ్వం. ఎప్పట్లానే విశాఖతీరంలో పెద్ద వినాయకుడిని పెట్టి, గొప్పగా పూజ చేస్తాము. కొత్తగా ఏర్పడింది మా రాష్ట్రం. అంచేత విఘ్ననాయకుడివి..వినాయకుడివి ముందుగా మా వద్దకే రావాలి. మా పూజలు గైకొనాలి. అర్థమైందా స్వామీ" అన్నాడు కళ్లు మూసుకుని తాదాత్మ్యతతో.

పార్వతీదేవి మరోసారి ఆశ్చర్యపోయింది.

"నువ్వున్నదొక్కడివి. రెండు చోట్లకి ఒక్కసారే ఎలా వెళ్లగలవు? ఒకరి దగ్గరకి వెళితే మరొకరికి కోపం కట్టలు తెంచుకుంటుంది. ఇద్దరూ నీకు కావాలి. వాళ్లకీ నువ్వు కావాలి. నీది నిజంగా విపత్కర పరిస్థితేనయ్యా. ఏం చేయాలో నాకూ పాలు పోవడం లేదు."అంది కొడుకు పక్కన చతికిలబడి కూర్చుని.

కొంత సేపటికి పరమ శివుడు పార్వతినీ, వినాయకుణ్నీ వెదకుతూ అక్కడికి వచ్చి పార్వతి చూసినవే, దివ్య దృష్టితో చూసి"హా కుమారా! ఎటువంటి సమస్య వచ్చిందయ్యా నీకు." అని బాధపడ్డాడు.

అలా అలా దేవతలందరూ అక్కడకు వచ్చి చింతాగ్రస్తులై కూర్చున్నారు.

సరిగ్గా అప్పుడొచ్చాడు విష్ణుమూర్తి.

"మీరందరూ మీ మీ కార్యకలాపాలు సాగించకపోతే సృష్టి ఎలా సాగుతుంది? అందరూ ఇక్కడ చేరారేమిటి?"అడిగాడు విసుగ్గా. శివుడు జరిగింది చెప్పాడు.

"శివా! నీ ఫ్యామిలీవల్ల నాకెప్పుడూ చికాకులే. సరే సరే ఈ సమస్యను ఎలా అధిగమించాలో ముందు ఆలోచిద్దాం"అని "అన్నట్టు నాకో ఉపాయం తోస్తోంది. మీరూ వినండి." అని తనకు తోచింది చెప్పాడు.

దానికందరూ ఆమోదముద్ర వేశారు.

అదేమిటంటే-

పార్వతీదేవి స్నానాల గదిలోకెళ్లి నలుగు పిండితో బొమ్మ తయారు చేసి బయటకు తీసుకొచ్చింది. దానికి తలలేదు. వెంటనే శివుడు ఉత్తర దిక్కున తలపెట్టి నిద్రిస్తున్న ఏనుగుని చూసి 'ఈ గజ జాతికింకా బుద్ధి రాలేదు. తాతల కాలంనాటి తప్పులే మళ్లీ చేస్తున్నాయి. అయినా అదంతా నాకెందుకులే' అనుకుని దాని శిరసు ఖండించి కొత్త బొమ్మకి అతికించి ప్రాణం పోసి, 'అచ్చు వినాయకుడు' అని నామకరణం చేశాడు. ఈయన కూడా అచ్చం మొదటి వినాయకుడి లాగానే ఉన్నాడు. అది చూసి వినాయకుడు "అమ్మా! నువ్వూ, నాన్నా భూలోకానికి వెళ్లి ఎప్పుడు క్లోనింగ్ శాస్త్రం నేర్చుకున్నరే, అచ్చం వీడు నాలాగానే ఉన్నాడు" అన్నాడు ఆశ్చర్యంగా.

"నారాయణ, నారాయణ, అవునవును దీనినే భూలోకంలో డబల్ యాక్షన్ అందురు"అన్నాడు నారదుడు.

"నాయనా, మీరిద్దరూ మాకు రెండు కళ్లు. ఒక శక్తికి రెండు రూపాలు. అచ్చు వినాయకోత్పత్తి రహస్యం మన లోకం దాటి బయటకి ఎట్టి పరిస్థితుల్లో వెళ్లకూడదు. వ్రతకల్పంలో అస్సలు చోటు చేసుకోకూడదు. మీరిద్దరూ బాధ్యతలు సమానంగా పంచుకుని ఆనందంగా ఉండండి. రెండు రాష్ట్రాలకీ ఒకే సమయంలో వెళ్లి, వాళ్లకి అష్ట ఐశ్వర్యాలు, ఆయురారోగ్యాలూ పంచండి. చల్లగా చూడండి. ఆ రాష్ట్రాల ప్రజలు ఒకరివంక మరొకరు చూసుకోరు కాబట్టి ఎవరికి వారు తమ వినాయకుడే తమ దగ్గరకి మొదట వచ్చాడు. తామే గ్రేట్ అనుకుంటారు. మనకు కావలసింది జనావళి క్షేమం. వెళ్లిరండి. సమస్త సన్మంగళాని భవంతు"అన్నాడు శివుడు.

అందరూ ఆ మాటలు విని ఆనందంగా తమ తమ సృష్టి కార్యకలాపాలు నిర్వహించడానికి వెళ్లిపోయారు.




మా ఉమేశానికి ఉండ్రాళ్ళంటే మహాఇష్టం. వాడూ-నేనూ బాల్య మిత్రులమే గాక, ఒకే కార్యాలయంలో ఉద్యోగం నెరపుతున్నాం. మా ఉమేశం వినాయక చవితి నాడే పుట్టాడు. వాడి పుట్టుక పెద్ద ప్రహసనం. వాళ్ళది ఉమ్మడి కుటుంబం. వాడి పిన్నికీ అంటే బాబాయ్ భార్యకూ, వాళ్ళ అమ్మకూ ఒకే మారు కానుపు ఐందిట. మంత్రసాని పుట్టగానే ఇద్దరు పిల్లల్నూ తీసుకెళ్ళి శుభ్రం చేసి వీడ్ని పిన్ని పక్కనా, పిన్నికి పుట్టిన ఆడపిల్లను వీడి అమ్మ పక్కనా పడుకో బెట్టిందిట! వీళ్ళమ్మ లబోదిబో నాకు పుట్టింది పిల్లాడు, పిల్ల కాదు అని ఒకటే గొడవట! పిన్నేమో ' కాదు కాదు నాకే పిల్లాడు పుట్టింది.' అది నీ పిల్లే ' అనీనీ, చివరకు ఇంటిల్లిపాదీ వచ్చి పిల్ల ల్ని చూసి, వీడి అమ్మ ముక్కు పొడవుగా కొనదేలి ఉండటాన, పసి గుడ్డు ముక్కూ అలానే ఉందని పిల్లాడ్ని కనింది వీళ్ళమ్మేనీ, పిన్ని ముక్కు చిన్నది గా ఉండటాన ఆ పాపాయి ముక్కు చిన్నది గనుక పాపాయిని కనింది పిన్నేననీ తీర్పు ఇచ్చాక, బాలింతలు ఇద్దరూ గమ్మునై పోయారుట! అప్పటికీ చాటు మాటుగా వాళ్ళ పిన్ని వీడికి తన చనుబాలు పట్టి తృప్తి పడేదిట ! కాస్తంత పెరిగాక వీడి రూపు అచ్చం వాళ్ళమ్మలా ఉన్నట్లు కార్బన్ కాపీ అని తెల్సి వాళ్ళ పిన్నిగమ్మునై పోయిందిట! అలా వాడు ఇద్దరు తల్లుల చనుబాల ముద్దుల కొడుకై బాగా బలంగా పెరిగాడు. వినాయక చవితి నాడు పుట్టి నందున వినాయకుని లాగే ఉంటాడు. వాళ్ళ బామ్మ చాలా రోజులు వీడి పుట్టుక ప్రహసనం చెప్పి, చెప్పి బోసి నవ్వు నవ్వుతుండేది.

వినాయక చవితి నాడు పుట్టడంతో నైవేద్యానికి చేసే ఉండ్రాళ్ళే వీడి పుట్టిన రోజు ఫలహారాలయ్యాయి. అందుకేనేమో మా ఉమేశానికి ఉండ్రాళ్ళంటే మహా ఇష్టం.అప్పుడప్పుడూ ఉండ్రాళ్ళు ఫలహారానికి చేయమని వాళ్ళమ్మని గొడవ చేసేవాట్ట. ఆమె అవి తినీ తినీ వీడి పొట్టా గణపతి పొట్టలా అవుతోందని భయపడి, "తప్పు బాబూ! ఉండ్రాళ్ళు వినాయక చవితి నాడే చేయాలి, గణపతికి నివేదన చేసి మనం తినాలి." అని చెప్పేదిట! మా ఉమేశానికి 'ఉండ్రాళ్ళ' పిచ్చి ముదిరి పోయింది. ఎక్కడైనా కొనుక్కు తిందామన్నా ఉండ్రాళ్ళు ఏ స్వీట్ షాపులోనూ దొరకవాయె!. వినాయక చవితి వెళ్ళగానే "అమ్మా! మళ్ళా వినాయక చవితి పండుగ ఎప్పుడొస్తుందే?" అని అడిగేవాట్ట! రాను రానూ వీడి ఉండ్రాళ్ల పిచ్చి అందరికీ తెల్సి 'ఉండ్రాళ్ళ ఉమేష్' గా ఇంటి పేరే మారిపోయింది. ఎలాగో చదువు పూర్తై ఇద్దరమూ ఒకే కార్యాలయోద్యోగులమయ్యాం. మా ఇరువురికీ వివాహాలయ్యాయి. నాకు ముందు, ఒక నెలకే మా వాడికీనీ.

పెళ్లి చూపుల్లో వాళ్ళ అమ్మతో మెల్లిగా "ఉండ్రాళ్ళు చేయటం వచ్చో-రాదో, కనుక్కోమని" చెవిలో గుసగుసలాడగా, ఆమె గుడ్లురిమి చూసిందిట! నోరు మూసుకోమని. పెళ్ళాయ్యాక , తమాషాగా వినాయక చవితి రోజే వీడి ఖర్మ కాలి మొదటి రాత్రైంది. అందంగా ఉంటుంది ఉమేష్ భార్య సత్యభామ. పాల గ్లాసుతో గదిలోకొచ్చిన భామతో ముందుగా మావాడు అడిగిందేంటో వింటే ఎవరికైనా నవ్వాగదు.

"ఈరోజు వినాయక చవితి కదా ! మీఇంట్లో ఉండ్రాళ్ళు చేసుకోరా?" అని. పాపం సత్యభామ పిచ్చిచూపు చూసిందిట! ఐనా మావాడు "అదే వినాయకునికి ఉండ్రాళ్ళు నివేదన చేయరా? మా అమ్మ ప్రతి వినాయక చవితికీ చేసి నివేదన చేస్తుంది. "అన్నాట్ట మళ్ళానూ. ఆమె వెంటనే గది బయటి కెళ్ళి "అమ్మా! ఆయనకు వినాయక చవితి ఉండ్రాళ్ళు కావాలిటే!" అనిఅడిగిందిట వాళ్ళమ్మను. ఆమెకు ఏమీ అర్థం కాక " ఈరోజు అల్లుడు వస్తున్నాడని వినాయక చవితి ప్రత్యేక వంటలు చేయకుండా మామూలు స్వీట్స్ చేశానే ! ఉండు అన్నను స్వీట్ షాపుకు పంపి ఉన్నాయేమో చూడమంటాను." అని వాళ్ళబ్బాయిని స్వీట్ షాపుకు పంపిందిట. కాలం మారిపోయిందాయె, ఈ రోజుల్లో చదువుకున్న చాలా మంది అమ్మాయిలకు 'ఉండ్రాళ్ళు' చేయటం రాదనేమోని 'పుల్లారెడ్డి' స్వీట్ షాపులో ఉండ్రాళ్ళూ దొరుకుతున్నాయి! ఉండ్రాళ్ళు ఒక కిలో తీసుకు వచ్చాట్ట పెళ్ళికూతురు అన్నగారు. పెళ్ళి కూతురు తల్లి అవన్నీ ఒక ప్లేట్ లో సర్ది లోపలికి పంపిందిట! " చాలా థాంక్స్ సత్యా! నాకు వినాయక చవితికి ఉండ్రాళ్ళు తినే అలవాటు చిన్నతనం నుండీ, పైగా ఈ రోజే నా పుట్టిన రోజు కూడానూ. నీకు ఉండ్రాళ్ళు చేయటం వచ్చుగా ? రాకపోతే నేర్చుకో మీ అమ్మ దగ్గర.." అంటూ ఉండ్రాళ్ళు లాగి స్తున్న తన భర్త ఉమేష్ ను చూస్తూ లోలోపల నవ్వుకుందిట తొలి రేయి కొత్త పెళ్ళి కూతురు.

అదండీ మా ఉండ్రాళ్ళ ఉమేష్ కథా కమామీషూనూ.




మా హనుమంత రావు మహా చాదస్తుడు. దేన్నీ ఒక పట్టాన నమ్మడు, ఎవ్వరి మీదా నమ్మకం లేదు. చిన్న తనం నుంచీ వాళ్ళమ్మా నాన్నల్ని వేధించి బాధించేవాడు. ఆ వాయనాలు అందుకోను ఆ తర్వాత అతడి భార్య నోచుకుంది. ఆవిడకు ఓపికెక్కువైనా ఒక్కో మారు భరించ లేక ప్రజ్వరిల్లి పోయేది . జ్వరం వస్తే మందేసుకోడు. లంకణం పరమౌషధం అంటూ ఏమీ తినకుండా త్రాగకుండా ముడంకేసి పడుకుని , మరునాడు లేచి నడవ లేక చెరో రెక్కా పుచ్చుకు అమ్మా నాయనా నడిపించాల్సి వచ్చేది చిన్నప్పుడు. ఇప్పుడూ అదే తీరు. ఇప్పుడు అతడి శ్రీమతికి వాడి తల తిక్క అర్థం కాక అవస్త పడుతున్నదని తెలిసింది. ఓ రోజు మార్కెట్లో కనపడి, " అన్నయ్య గారూ! మీస్నేహితునితో కనాకష్టమై పోతున్నదండీ! వాళ్లమ్మగారెట్లా వేగారో కానీ నా ఓర్పు నశించి పోతున్నదండీ! ఏమీ చేయలేక మౌనంగా ఉంటున్నాను. ఈ మధ్య మరీ చాదస్తం పెరిగి పోయింది. కడుపు నొప్పొస్తే కాఫీ కూడా తాగరు, కాలు నొస్తే అడుగైనా వేయరు, తల నొప్పొస్తే ముసుక్కప్పుకు పడుకుంటారు, ఎంత తాలూకాఫీసుదైనా ఉద్యోగమేం కానూ? కాస్త మీరైనా వచ్చి చెప్పి పుణ్యం కట్టుకోండి, బాల్య స్నేహితులు కదా! మీ మాటేమైనా వింటారేమో!" అని మొర పెట్టుకుంది. చెల్లెల్ని చూసి పాపమనిపించింది.“ అలాగే చెల్లెమ్మా ! ఈ ఆదివారం వస్తాగా!" అని చెప్పి పంపాను. ఆదివారం రానే వచ్చింది. నేను మరువకుండా హనుమంతు ఇంటికి పోనే పోయాను. నే వెళ్ళే సరికి వాడు ఈజీ ఛైర్లో అనీజీగా పడుకుని ముందున్న ఎత్తు స్టూలు మీద కాళ్ళు బార్లా జాపుకుని ఉన్నాడు.

"ఏమిట్రా! హనుమంతూ అలా ఉన్నావ్?" అని పలకరించగానే చెట్టంత మగాడూ చేతుల్లో ముఖం దాచుకుని భోరుమన్నాడు. మావాడు ఆరడుగుల ఎత్తూ ఎత్తుకు తగిన లావూనూ. మంచి పర్శనాలిటీ "ఛా ఊర్కోరా! ఎవరైనా చూస్తే బాగోదు, 'ఊరికూరికే ఏడ్చే మగాడ్నీ, నవ్వే ఆడ మనిషినీ ఎవ్వరూ నమ్మరాద ‘ నే పాత సామెత కూడా ఉంది. ఏమైందిరా ఇప్పుడు?" అంటూ ఓదార్చాను."ఏముందిరా ఇహ నా పనై పోయినట్లేరా! నడవలేక పోతున్నానురా! కాళ్ళు నొప్పులు. నా ఉద్యోగం మా

ఆవిడకిస్తారేమో కనుక్కోరా! బాబ్బాబూ ఈ సాయం చేసి పెట్టు" అంటూ బ్రతిమాలసాగాడు. నాకు ఆపుకోలేనంత కోపం వచ్చింది.

"ఛ నోర్ముయ్! తిని కూర్చుని తగుదునమ్మా అంటూ ఏడుపొకటి!! ఛీ నిన్ను నా స్నేహితుడనిచెప్పుకోనే సిగ్గుగా ఉందిరా! పద హాస్పెటల్ కెళదాం" అన్నాను. ఇంతలో నేను వచ్చింది గమనించుకున్నట్లుంది. కాఫీ కప్పుల్తో వచ్చింది చెల్లెమ్మ. "అన్నయ్య గారూ ఏం చెప్పమంటారు? కుర్చీ దిగరు, కాలు కదపరు. నొప్పంటారు. అన్నీ ఇక్కడే! ఏం చేయను ? 'ఆలోపతం' టే అపనమ్మకం, 'నాటు వైద్య' మంటే నో అంటారు.' నాచురోపతం' టే నాన్చేస్తారు . 'ఆయుర్వేద' మంటే నిర్వేదం. 'న్యూరోపతం' టే నిర్వీర్యంగాచూస్తారు..." అంటూ ఆమె చెప్తుండగా, నా జేబులో ' చరవాణి' మోగింది. చూస్తే మా శ్రీమతి. "ఏంటో చెప్పు సంతోషీ!" అన్నాను. "ఏమీ లేదండీ! నా కాలు నొప్పి సగమే తగ్గింది. మరో పక్షం పాటు మందు వాడాలి. హోమియో హాస్పెటల్ అటేగా కాస్తంత మందు పట్టుకు రండి, నా ఫైల్ నెం. 99." అంది నా శ్రీమతి." అలాగేలే" అంటూ 'చరవాణి 'ని జేబులో వేసుకుని," అన్నట్లు చెల్లెమ్మా! వీడికి హోమియోపతి చేయిద్దాం. నా భార్య అదే వాడుతున్నది చక్కగా తగ్గు ముఖం పడుతున్నాయి మోకాలి నొప్పులు. పదరా వెళదాం నా బైక్ మీద తీసుకెళతాను." అంటూవాడ్ని లేపబోయాను.

"నేను రానురా! నడవలేను. నా వల్ల కాదు." అంటూ మొరాయించ బోయాడు. "రాక తప్పదురా! లే లే!" అంటూ రెక్క పట్టుకుని లేపాను. చెల్లెమ్మ మరో రెక్క పట్టుకుంది." ఉండండి అన్నయ్య గారూ! మాకు రోజూ వచ్చే ఆటో తెస్తాను , బయటే ఉంటుంది., మీరొక్కరే ఈయన్తో వేగలేరు " అంటూ ఆమె వెళ్ళి బయట ఉన్న ఆటో పిల్చుకొచ్చింది. వాడిని లోపలికి తోసి ఇద్దరం చెరో పక్కా కూర్చున్నాం. పావు గంట డ్రైవ్ లో ఉన్న మా హోమియో వైద్యశాల చేరాం. ముగ్గురం లోపలికెళ్ళాం. మా అదృష్టం కొద్దీ అప్పుడు ఆయన ఖాళీగా ఉన్నారు. మంచి హస్త వాసి గలవాడు, అనుభవజ్ఞుడూనూ. నన్ను చూడగానే మహదానంద పడ్డారాయన. "మీ శ్రీమతి మోకాళ్ళ నొప్పులేలా ఉన్నాయండీ! " అని నవ్వుతూ పలకరించాడు. వైద్యునికి ఉండాల్సిన నిదానం, ప్రేమ తత్వం, ఓర్పు, సహనం, రోగి ఆరోగ్యం పట్ల ఆసక్తి, వ్యాధి తగ్గించాలనే పట్టుదలా, వ్యాధి పట్ల అవగాహన ఉన్నవాడని నా సంపూర్ణ విశ్వాసం.

" మా శ్రీమతి కోసమే వచ్చానండీ! ఆమె మోకాలి నొప్పి చాలా వరకూ తగ్గింది, మందు ఐపోయిందని వచ్చాను." అంటూ ఆమె వివరాలన్నీ ఆయన అడుగుతుంటే చెప్ప సాగాను. మాహనుమంతు దగ్గాడు తన ఉనికిని గుర్తించమన్నట్లుగా. నాకు విషయం అర్ధమైంది." డాక్టర్ గారూ! ఇతడు నా స్నేహితుడు, హనుమంత రావు. కొంత కాలంగా కాళ్ళ నొప్పులతో బాధ పడుతున్నాడు. మీరైతే తగ్గిస్తారనే విశ్వాసంతో తీసుకొచ్చాను."అన్నాను."చాలా సంతోషమండీ! తప్పక తగ్గించే ప్రయత్నం చేస్తాను. ముందుగా ఈ మందు మీ శ్రీమతిని పరకడుపున ఐదేసి మింగమనండి. ఈ మందు రోజుకు 3 మార్లు." అని మందు సీసాలు రెండు నాకు ఇచ్చాక, మా స్నేహితుని వైపు చూసి " మీకేస్ షీట్ రాసుకుంటాను. నేను అడిగే ప్రశ్నలకు సమాధానమివ్వండి. హోమియో వైద్యం మందిచ్చే వైద్యుని మీదా, మందు మీదా కూడా నమ్మకం ఉంచితే బాధ త్వరగా తగ్గిపోయి ఫలితం చూపుతుంది. ఈ హోమియో అలోపతిలా నేరుగా నొప్పున్న చోటుకు వెళ్ళి తగ్గించడం కాక , అసలు నొప్పి రాను కారణాలేంటో తెల్సుకుని దాన్ని తగ్గిస్తూ నొప్పి రాకుండా నివారిస్తుంది. దాని కోసం మిమ్మల్ని నేను అడిగే ప్రశ్నలకు నిదానంగా సమాధానాలు చెప్పండి." అంటూ వైద్యుడు ముందుగా పేరు, వయస్సూ రాసుకుని, " మీ స్వగ్రామమేది? " అనడిగాడు.

మా వాడు "మా ఊరికీ మిరిచ్చే మందుకూ లింకేమిటండీ!" అన్నాడు ఆశ్చర్యంగా. "అలా కాదండీ! మీరు నేనడిగేవన్నీ చెప్పాలి. మీరు జన్మించిన ఊరేది?". మా వాడు చెప్పాడు."మీ వృత్తి?" " నా వృత్తితో పనేంటండీ! ఐనా నేనేం లంచగొడిని కాను. నిజాయితీగా నిఖార్సైన ఉద్యోగిని." "అలా కాదు చెప్పరా బాబూ!" అంటూ నేను వెన్ను తట్టాను. చెప్పాడు. "మీ చదువు " "అదేంటండీ! చదువుకున్న వారికే మీరు మందులిస్తారా?, ఇంజనీరైతే ఒక మందూ, వైద్యు డైతే ఇంకో మందూ , టీచరైతే మరో మందూ .." అబ్బాబూ! నా మాట వినరా హనుమంతూ.."అని బ్రతిమాలగా, చెప్పాడు. "మీకు ఇష్టమైన రంగు?" ఈ మారు మా చెల్లెమ్మ చెప్పింది. "మీరు ఎక్కువగా ఇష్టంగా తినే పదార్ధం? శాకాహారమా? మాంసాహారమా దేన్ని ఇష్ట పడతారు? "అదీ చెల్లెమ్మే చెప్పింది." మీకు ఇష్టమైన పండు.." " ఇదేం ప్రశ్న? ఏది దొరికితే అదే తింటాం? చలికాలంలో మామిడి పండు దొరుకుతుందా తిందామన్నా? " ---"ఒరే ఏంట్రా ఈ పిచ్చి ప్రశ్నలు?" అన్నాడు నా వైపు చూసి మెల్లిగా.. "ఒరే హనుమంతూ! ప్రశ్న బాగా వినరా! వారు అడిగింది నీకు బాగా ఇష్టమైన పండు పేరు మాత్రమేరా!" అని నేను కోప్పడ్డాక చెప్పాడు. "మీకు ఇష్టమైన కూరగాయ? " " ఇదీ ఒక ప్రశ్నేనా? ఐనా ఉద్యోగం ఇంటర్వ్యూలో అడిగినట్లు, ఓ మందు నా ముఖాన కొట్టను ఇవేమి ప్రశ్నలండీ! ఐ.ఏ.ఎస్. వార్ని అడిగినట్లూ?" సహనమన్న సద్గుణం వాడికి ఏ కోశానా లేనే లేదు.

చెల్లెమ్మ కలుగజేసుకుని చెప్పింది. "మీకు ఇష్టమైన పుష్పం ?". చెల్లెమ్మ "మల్లె " అనగానే ," ఆమెను తట్టి, " అది నీకు ఇష్టమైన పువ్వు, నాకు జాజి పువ్వేగా ఇష్టం ? మన తొలి రాత్రి నాడు మీ వాళ్ళు మల్లెల మాలలు మంచం చుట్టూ కట్టగా నేను అడిగి మరీ జాజి పూల మాలలు మార్పించుకున్నాను. అందుకేగా ముహూర్తం గంట లేటైంది. మొగుడి ఇష్టాలు కూడా మర్చి పోతారు భార్యలు రెండేళ్ళు కాగానే " అంటూ భార్య వైపు కొర కొరా చూడగా, ఆమె సిగ్గులో చీర చెంగులో ముఖం దాచుకుంది. నేనూ వైద్యుడూ కూడా నవ్వాపుకున్నాం. 'పిచ్చి కుదిరింది రోకలి మెడకు చుట్టమన్నట్లు 'మా వాడి తిక్క పెరిగిపోయిందని నాకు అర్ధమైంది . "మీరు కోరుకునే జీవన సరళి ?బాధ్యతలూ-బరువులూ లేకండా హాయిగా ఉండాలనా? బాధ్యతలు తప్పనిసరిగా తీసుకోవాలనా? " "అదేంటండీ! భర్తగా నా బాధ్యత వదిలేస్తానా? మరొకరికి బదలాయిస్తానా? "అంటుండగా నేను ఆ ప్రశ్న వదిలేయమని వైద్యుని వైపు చూసి సైగ చేశాను. "మీ తండ్రి గారికి గానీ, తాత గారికి గానీ, తల్లి, వాళ్ల తల్లికి గానీ ఏవైనా పెద్ద జబ్బులు, లేదా మీ వంశంలో ఎవరికైనా నయం కాని వంశపారం పర్య వ్యాధులేమైనా ఉండేవా? "మా వాడు చర్రున లేచాడు, తోక తొక్కిన త్రాచులా. " అంటే మా కుటుంబం అంటు వ్యాధుల కుటుంబమని చాటుతారా? ఆసలు మీకు మా తాత ముత్తాతలతో పనేంటండీ? మందు నాకా? మా వాళ్ళకా ఇచ్చేదీ? లేక వాళ్ళకు మందులు పంపను నన్ను వాళ్ళ దగ్గరకు పైకి పంపుతారా ఏం? "అంటూ వీర నరసిమ్హ స్వామిలా ఉగ్ర రూపంతో లేచాడు. "అబ్బా ! నీ గోల ఆపి చెప్పరా!" అని గడ్డం పట్టుకోగా, " నే చెప్పను పో " అంటూ పసి పిల్లాడిలా నా చేయి విసిరి కొట్టాడు, అది వెళ్ళి గోడక్కొట్టుకుని జివ్వున లాగింది భరించలేని బాధతో, "అయ్యా! వైద్యులు గారూ ఇహ ప్రశ్నావళి ఆపి మందిచ్చి పంపండి ఈ సారికి" అన్నాను, షాక్కొట్టిన నా మోచేయి రుద్దుకుంటూ.

వైద్యుడు నవ్వి "సరిసరి, చివరికి వచ్చేశాం, మీకు ఎలా ఉండాలని ఇష్టం? సరదాగానా? సీరియస్ గానా? " "అయ్యా! ఇంత దాకా

చూశారుగా ? మళ్ళీ ఈ ప్రశ్న ఎందుకండీ!” అంది చెల్లెమ్మ. “సరే మీరు ఎలాటి సినిమాలు ఇష్ట పడతారు?” “ఆయనసలు సినిమాలే చూడరండీ! పెళ్ళయ్యాక మేము సినిమా కెళ్తే ఒట్టు” అంది చెల్లెమ్మ. “లాస్ట్ బట్ లీస్ట్, మీరు ఎటు వైపు తిరిగి పడుకుంటారు? కుడి వైపా?ఎడమ వైపా? “ “పెళ్లైన మగాళ్ళను అడిగే ప్రశ్న కాదిది? ఐనా అడిగారు గనుక చెప్తున్నా మా ఆవిడ వైపు తిరిగి పడుకుంటాను, మీకేమైనా అభ్యంతరమా?” అన్నాడు గుడ్లు మిటకరించి. చెల్లెమ్మ అక్కడ ఉండలేక బయటి కెళ్ళి పోయింది. నేను “సార్! ఈహ కేస్ స్టడీ ఆపేసి ప్రస్తుతానికి మందివ్వండి.” అని ఈ మారు వైద్యుని నేను బ్రతిమాలాను, అక్కడింకా కొంత సేపు ఉంటే, ఏమి ప్రశ్నలూ, ఏమి సమాధానాలు వినాల్సి వస్తుందోనే భయంతో. "సరేనండీ! మీ ఇష్ట ప్రకారమే చేస్తాను. ఈ మందు మాత్రం సరిగ్గా నేను చెప్పినట్లు వాడాలి, ఇది టీ.వీ. యాడ్స్ లో చూపేట్లు, అలోపతి ‘ఆస్పిరిన్ ‘ బిళ్ళ వేసుకోగానే "అయ్యో పోయిందే!" అన్నట్లు పోదు, అసలు మీకు కాలు నొప్పి ఎందుకు వస్తున్నదో ఆమూలం నుంచి పని చేసి తగ్గిస్తుంది. " అంటూ తీపి గుళ్ల సీసాలు3 ఇచ్చాడు వైద్యుడు. వాటినెలా వేసుకోవాలో వేసుకునే ముందూ తర్వాతా ఏం చేయాలో వివరాలు చెప్తే నేనే అన్నీ వ్రాసుకున్నాను. అతడికి నేనే ఫీజిచ్చి, మా వాడ్ని బయటికి రెక్క పట్టి లాక్కొచ్చి, వైద్యుని సలహా మేరకు రోజూ నడిపిస్తూ, మందులేయించాక, రెండు నెలల్లో మా వాడు, ఎంతో కాలంగా తీసుకుంటున్నకాలు నొప్పి మటు మాయమై, వాడి టూ వీలర్ అమ్మేసి, కాలి నడకన కార్యాలయానికి రాసాగాడు.




“ఫెయిల్యూర్ క్లబ్”

ఆ పేరు కొత్తగా, చిత్రంగా అనిపించింది.

రోడ్డు మీద నడుస్తున్న వాడినల్లా

ఆ బ్యానర్ చూసి ఠక్కున ఆగిపోయాను.

సాధారణంగా గెలుపు గురించి అందరూ మాట్లాడుకుంటారు.

గెలుపు ... సంపద,కీర్తి ప్రతిష్ఠలు, ఆత్మసంతృప్తి వంటి వాటిని తన వెంట తెస్తుంది.

గెలిచిన వాడి చుట్టూ జనం మూగుతారు. నిత్యం పొగడ్తలతో ముంచెత్తుతారు.

గెలిచిన వ్యక్తి ముఖంలో విజయగర్వం, తేజస్సు కనిపిస్తాయి.

మరి ఓటమి...

ఓటమి అవమానభారాన్ని పెంచుతుంది. ఆత్మన్యూనత, ఆందోళన, భయం, నైరాశ్యం వంటి వాటిని తోడుగా తెస్తుంది.

ఓడిన వ్యక్తి గుంపుగా దూరంగా పారిపోతాడు. తననెవరూ గుర్తించకుండా ఉండే బావుంటుందనుకుంటాడు.

ఓడిన వ్యక్తి ముఖంలో నిరాశానిస్పృహలు కొట్టొచ్చినట్టు కనిపిస్తాయి.

గెలుపుకి అందరూ బంధువులయితే.. పాపం ఓటమి మాత్రం అనాథ.

“ మరిక్కడేం జరుగులోంది?” ఆలోచించుకుంటూ లోపలకి అడుగుపెట్టాను.

నిజానికి అక్కడ కార్యాలయం లాంటిదేమీ లేదు.

ఓ ఆలయ ప్రాంగణంలో ... ఖాళీగా ఉన్న చిన్న గది ముందు బ్యానర్ కట్టారు. లోపల వలయాకారంలో కుర్చీలు వేశారు. బహుశా ఒకరి తర్వాత మరొకరు మాట్లాడేందుకు వీలుగా ఈ ఏర్పాటు చేశారేమో తెలిదు.

దాదాపు పది మంది వరకూ అక్కడక్కడ గుంపులుగా చేరి మాట్లాడుకుంటున్నారు.

సమావేశం ప్రారంభం కావటానికి మరికొంచెం సమయం పట్టేట్టుంది.

రెండడుగులు బయటకు వేసి సిగరెట్ ముట్టించాను.

ఇంతలో... మొబైల్లో మెసేజ్ వచ్చినట్టుగా రింగ్ టోన్ మోగింది. తీసి చూశాను.అది ప్రణవి నుంచి.

అప్పటికే ఐదారు మెసేజులున్నాయి. అన్నీ ఆమె నుంచే.

“ బయలుదేరావా? సమయం గుర్తుందిగా... రాత్రి 10.20...”

కాళ్లలో వణుకు మొదలయ్యింది.

నిన్న రాత్రి మా ఇద్దరిమధ్యా నడిచిన సంభాషణ కళ్ల ముందు మెదిలింది.

“ ఈ సమస్యలు ఒక కొలిక్కి వచ్చేలా లేవు. మనిద్దరం కలిసి జీవించటం కష్టం అనిపిస్తోంది. కనీసం కలిసి చనిపోదాం. అప్పుడయినా మనకి తృప్తి”...ప్రణవి చెబుతోంది.

శీతాకాలం సాయంత్రం. ఆ వంతెనపైన రద్దీ తక్కువగా ఉంది. దిగువ నుంచి రైలు వెళుతోంది. ఆ హోరులో ఆమె చెప్పిన మాటలు కొన్నే నా చెవిన పడ్డాయి.

నుదుటి మీదకు జారుతున్న ముంగురులను ఎడం చేత్తో పైకి తోసుకుంటూ మళ్లీ ఆమాటలు చెప్పింది. ఉలిక్కి పడ్డానునేను. జీవితం పట్ల స్పష్టత, లోతయిన అవగహన ఉన్న అమ్మాయి నుంచా నేను ఈ మాటలు వింటున్నది... ఆశ్చర్యం కలిగింది నాకు.

ఎనిమిది నెలల క్రితం ఇంజనీరింగ్ కాలేజీలో మొదటి సారి ఆమెను చూశాను.

టీవీ రిపోర్టుగా ఓ యూత్ ప్రోగ్రాం నిమిత్తం అక్కడి కెళ్లాను. చాలా చురుకయిన పిల్ల. మనసులోని భావాలను దాచుకోవటం తెలీదు అని మొదటి పరిచయంలోనే గ్రహించాను.

“ మీ కార్యక్రమం ఇప్పటి జనరేషన్ కి తగినట్టుగాలేదు. వరకట్న సమస్యలు, మీరెలాంటి వ్యక్తిని పెళ్లాడాలనుకుంటున్నారు? భవిష్యత్తులో మీరేం కావాలనుకుంటున్నారు? ఇవన్నీ అవుట్ డేటెడ్ సబ్జక్టులు. ఇందులో చూసి నేర్చుకోటానికి ఏముంది? కాలక్షేపం తప్ప” అంటూ మొహం మీదే కడిగిపారేసింది.

నేను ఆ మాటల్ని పెద్దగా పట్టించుకోలేదు గానీ.. నా పక్కనున్న కెమెరామెన్ మాత్రం..

“ మీకు ఇష్టం లేకపోతే మాట్లాడకండి. అంతేగానీ మా ప్రోగ్రామ్ ని తీసిపారేయకండి. ఛానల్ రేటింగ్ లో మా ప్రోగ్రాం మేం నెంబర్ ఒన్ తెలుసా?” అన్నాడు సమర్థించుకుంటూ.

ఆమె ఆ మాటల్ని తీసిపారేసింది.

“ మా కాలేజికి వచ్చారు కాబట్టి... నా అభిప్రాయం చెప్పాను. మీకు ఉపయోగపడుతుందనుకుంటే మార్పులు చేసుకోండి అంతే తప్ప నన్ను విసుక్కుంటే ఎలా?”. అంది నిర్మొహమాటంగా.

ఆ కాలేజిలో ఉన్న ఏడెనిమిది మంది ఇతర అమ్మాయిలతో పాటు ఆమె అభిప్రాయం కూడా తీసుకుని తిరిగొచ్చేశాం. కార్యక్రమం ప్రసారమయ్యే రోజున అలవాటుగా అందరికీ ఫోన్లో విషయం చెప్పాను. అది చూసి వాళ్ల అభిప్రాయాలు చెప్పమని కోరాను.

మిగతా వాళ్లు ఏం చెప్పారో నాకు గుర్తులేదు.

“మీరు మా అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇచ్చినట్టులేరు. అమ్మాయిల అందచందాలను మాటిమాటికీ చూపించటం తప్ప..” అంది ప్రణవి.

“ మీ అభిప్రాయం సరైనదే. మాట్లాడిన వాళ్లంతా టీవీలో కనిపించాలన్న ఆరాటంతో ఉన్నారు గానీ.. వ్యక్తీకరణ విషయంలో పెద్దగా శ్రద్ధ చూపలేదు” అన్నాను తను మాటలతో ఏకీభవిస్తూ.

తనెలా స్పందించిందో తెలియదు గానీ.. ఇది జరిగిన కొన్నాళ్లకి తనే నాకు స్వయంగా ఫోన్ చేసింది.

“ నా ఫ్రెండ్ ఒకమ్మాయి టీవీ ఛానల్ చూద్దామని గొడవ చేస్తుంటే మీరు గుర్తొచ్చారు. ఈ ఆదివారం వద్దామనుకుంటున్నాం. వీలుకుదురుతుందా?” అనడిగింది.

ఆమె అభ్యర్థనను కాదనటానికి నాకు ఎలాంటి కారణం కనిపించలేదు.

సాధారణంగా ఆదివారం ఉదయం అంత పని ఒత్తిడి ఉండదు. మా ఇన్ ఛార్జితో ముందుగా మాట్లాడి తగిన ఏర్పాట్లు చేశాను.

ప్రత్యేక శ్రద్ధతో అన్ని విభాగాలు చూపించాను.

నలుగురమ్మాయిలు వచ్చారు. మా క్రియేటివ్ హెడ్ వాళ్లని దగ్గర కూర్చోబెట్టుకుని ఛానల్లో వస్తున్న అన్ని కార్యక్రమాల గురించి ఫీడ్ బ్యాక్ అడిగి తీసుకుంది. అందులో ఒకమ్మాయి ముఖకవళికలు, మాటతీరు తనని బాగా ఆకట్టుకోవటంతో యాంకర్ గా అవకాశం ఇస్తామని కూడా హామీ ఇచ్చింది. ఇదంతా నా పరిచయం వల్లనేనని ఆమె స్నేహితులంతా ప్రణవిని మెచ్చుకున్నారు.

ఆమెకు కూడా నాపైన అభిమానం కలిగింది.

తనే అప్పుడప్పుడు ఫోన్ చేసి మాట్లాడేది.

చాలా సందర్భాల్లో నేను శ్రోతగా మిగిలేవాడిని. కొద్ది రోజుల్లోనే మా పరిచయం గాఢంగా మారింది. తరచూ ఇద్దరికీ అనుకూలమైన ప్రాంతం వంతెన పైన కలసి కబుర్లు చెప్పుకుంటూ ఉండేవాళ్లం. మొదట్లో పావుగంట, అరగంట మాట్లాడుకునేది తర్వాత గంటలు, గంటల సమయం దొర్లిపోయేది.

ఓ నెల్రోజుల క్రితం ...

‘‘ఒకరి అభిప్రాయలను మరొకరు గౌరవించుకునే జంట మంచి భార్యాభర్తలవుతారట. మనం పెళ్లి చేసుకుంటే బావుంటుందేమో?’’ అంది తనే.

‘‘అంత కంటే అదృష్టం మరొకటి ఉంటుందా?’’ అనిపించిందినాకు.

అప్పట్నుంచి మరింత ఉత్సాహంగా ఉండేవాళ్లం.

ఇంతలోనే ప్రణవి నుంచి ఈ మాటలు..

" ఏమిటి .. నువ్వంటున్నది?" సీరియస్ గా అడిగాను.

"నువ్వు విన్నది నిజమే. మా డాడీ  మన పెళ్లికి ఒప్పుకోవటం అసంభవం" అంది కుండబద్దలు కొట్టినట్టుగా...

 ఈ రోజు ఉదయం ఈ విషయాన్ని తేల్చి చెప్పేశారు డాడీ. అంతేకాదు. రేపు రాత్రికి చికాగోకి పంపుతారట. అక్కా, బావతో నువ్వూ వెళ్లాలి. కాస్త గట్టిగానే చెప్పారు."

"దేనికి?" ఆసక్తిగా అడిగాను.

"మా బావ తమ్ముడిని నేను తప్పనిసరిగా పెళ్లి చేసుకోవాలట. నాన్నగారు ఇన్ కం టాక్స్ సమస్యల్లో ఇరుక్కున్నప్పుడు వియ్యంకుడిగా అక్కయ్య మామగారు ఆదుకున్నారట. ఆ సమయంలో  తన రెండో కూతురిని కూడా కోడలుగా పంపాలని కోరితే ... అప్పుడున్న పరిస్థితుల్లో కాదనలేకపోయారట..."

" ఇప్పుడు నేను కాదంటే... నాన్నగారి మాట పోతుంది. అంతకు మించి అక్కయ్య కాపురం పైనా ప్రభావం చూపుతుంది" క్లుప్తంగా పరిస్థితిని వివరించింది ప్రణవి.

ఇంతకు మించి గత్యంతరం లేదు అన్న భావన ఆమె మాటల్లో కనపడింది. ఆ తర్వాత కొద్దిగా ఊపిరిపీల్చుకుని మళ్లీ తనే అంది.

" అంతకు ముందు అవసరం రాలేదు కాబట్టి చెప్పలేదు. ఇప్పుడు తప్పదుగా.. నీ గురించి  మొదటిసారి అమ్మకు చెప్పేశా...

 ఉద్యోగం సద్యోగం లేని వాడిని చేసుకుని నువ్వేం సుఖ పడతావే... " అంది.

నిన్ను కాళ్లు కింద పెట్టకుండా పెంచాం. చూస్తూ చూస్తూ ఓ బికారి గాడికిచ్చి ఎలా చేయం అంటూ పెద్ద గోలే చేసింది. ఈ

పరిస్థితుల్లో..'' అర్థోక్తితో ఆగిపోయింది ప్రణవి.

చర్నాకోలతో ఒంటిమీద చెళ్లున చరిచినట్టయింది నాకు.     అపరాధభావనతో కుంగిపోతున్నాను. ఆ నిముషంలో ఆమెకు ధైర్యం చెప్పే సాహసం చేయలేకపోయాను.

ఓ జాతీయ ఛానల్ వాళ్లు మా ఛానల్ ని టేకోవర్ చేయటంతో ఇక్కడున్న స్టాఫ్ లో చాలా మందిని బయటకు పంపారు. ముఖ్యంగా అప్పటి సీఈఓకి సన్నిహితంగా ఉన్న ఐదారుగురిని తప్పనిసరిగా వైదొలగవలసిందిగా హెచ్చరికలు చేశారు. అందులో నేనొకడిని.

సాధారణ ఉద్యోగిగా టీవీ ఛానల్లోకి ప్రవేశించిన నేను అనతికాలంలోనే     పై కెదిగాను. నాలుగయిదు ఛానళ్లు వరుసగా మారుతూ వేతన పరంగా ఎక్కువ సంపాదించే స్థాయికి చేరాను. దాదాపు అన్ని ఛానళ్లలోనూ నాకు పరిచయం ఉన్నట్టే.. నేను తమకు పోటీగా భావించి నా రాకను     అడ్డుకునేవాళ్లూ చాలా మంది ఉన్నారు.

' వద్దు సార్... వాడికి తలబిరుసు..

అన్నీ తనకే తెలుసనుకుంటాడు.. గ్రూపుతో కలసి సరిగా పనిచేయలేడు.

అందరూ తను చెప్పిందే వినాలన్న మొండి పట్టుదల ఎక్కువ.

ఎవరినీ లెక్క చేయడు. తను నచ్చిన ప్రోగ్రామ్ చేస్తాడు.. ఏం చేయాలనుకున్నాడో ముందు చెప్పడు. అనుమతి తీసుకోడు...

ఇలా నా గురించి చెడ్డగా ప్రచారం చేశారు. ఒకప్పుడు పేరుప్రతిష్ఠలు తెచ్చిన     నా సామర్థ్యాన్ని, వ్యక్తిత్వాన్ని బలహీనత,లోపాలుగా చెప్పుకొచ్చారు.

అందుకే నాకు వెంటనే అవకాశాలు రాలేదు.

“ ఏదో ఒక ఛానల్లో చేరటం దేనికి? నీ ప్రతిభకు, అనుభవానికి తగిన దానిలో అవకాశం వచ్చేదాకా వేచి చూడు” ...ప్రణవి సలహా క్రమంగా రోజులు నెలలయ్యాయి. అదృష్టం మాత్రం నా తలుపు తట్టలేదు.

నిరుద్యోగిగా ఒంటరి పోరాటం చేస్తున్న నాకు, ప్రణవిభారం కూడా మోయగలనన్న నమ్మకం కలగటంలేదు. ఆమెను ఇంట్లో నుంచి లేపుకుపోయి పెళ్లి చేసుకోలేను.

అలాగని మౌనంగా ఊరుకుంటే రేపు రాత్రికి ఆమె ఈ దేశం నుంచి ఎగిరిపోతుంది... తిరిగి నాకు దక్కుతుందన్న భరోసా లేదు.

మరెలా .. ఈ సమస్యను అధిగమించటం.. ” ఆలోచనలో పడ్డాను.

ప్రణవి సూటిగా అడిగింది.

“బాగా ఆలోచించే ఈ నిర్ణయం తీసుకున్నా.. నీకు చావంటే భయమా?”

“ లేదు” అంటూ తల అడ్డంగా ఊపాను.

“ అయితే నేను చెప్పేది విను.

రాత్రి 10.20 ప్రాంతంలో ఎక్స్ ప్రెస్ ఈ దారిన వెళుతుంది. మనం వంతెన మీద నుంచి చూస్తే రైలు రాక కనపడుతుంది. సరిగ్గా వంతెన కిందకు రైలు వచ్చే సమయానికి పైనుంచి దూకేద్దాం. శరీరం ఆనవాళ్లు లేకుండా ఛిద్రమవుతుంది. అలాగే మన సమస్య కూడా... ” స్థిరనిశ్చయానికి వచ్చిన దానిలా చెప్పేసింది.

నాకు కూడా అభ్యంతరం చెప్పాలనిపించలేదు.

సమయం దగ్గర పడుతున్న కొద్దీ గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

" హలో... హలో.. "

మైక్ లో ఎవరో మాట్లాడుతున్నారు. సమావేశం ప్రారంభమైనట్టుంది.

" ప్రణవిని కలవటానికి ఇంకా సమయం ఉంది. ఈ లోగా కాసేపు ఇక్కడే గడిపితే మనసు కాస్త కుదుటపడుతుందేమో " మరో ఆలోచన చేయకుండా లోపలకి నడిచాను.

----------------------------------------------------------

' ప్రకృతి మనకెన్నో పాఠాలు చెబుతుంది. వాటిని గ్రహించే ఓపిక, తీరిక మనకి ఉండటంలేదు." అతను మాట్లాడటం ప్రారంభించాడు.

రాలే ఆకు, వికసించే పువ్వు, గర్జించే మేఘం, మెరిసే మెరుపు , కరుగుతున్న కొవ్వొత్తి... ఇలా దేనితీసుకున్నా అది మనకు బోలెడు జీవితపాఠాలు చెబుతుంది."

" ఆయన రామస్వామి... ఈ క్లబ్ వ్యవస్థాపక ఛైర్మన్" పక్కనున్న వాళ్లెవరో చెప్పారు.

ఈ వాతావరణం నాకు కూడా కొత్తగా అనిపించింది. ప్రసంగాన్ని ఆసక్తిగా వినటం ప్రారంభించాను.

" ఈ జీవితం శాశ్వతం కాదని... రాలే ఆకు ద్వారా తెలుసుకోవచ్చు.

జీవించేది ఒక్క రోజయినా .. గౌరవంగా జీవించమని వికసించే పువ్వు చెబుతుంది.

వర్షించే మేఘం... చేదును గ్రహించి మంచిని పంచమని చెబితే.. మెరిసే మెరుపు.. ఉండేది ఒక్క క్షణమయినా ఉజ్వలంగా ఉండమన్న

దేశాన్నిస్తుంది. ఇక కరిగే కొవ్వొత్తి అయితే... చివరి క్షణం వరకూ పరులకు సాయపడమని సూచన ఇస్తుంది. మనం ఈ నీతిని హిస్తున్నామా? జీవితం విలువను గ్రహిస్తున్నామా?"

రామస్వామి గొంతు ఆ గదిలో ఖంగుమంటోంది. అందరూ చెవులు రిక్కించి వింటున్నారు. "సృష్టిని నిద్రలేపటంలో కోడి.. పరుగులో గుర్రం... వినటంలో పిల్లి.. విశ్వాసంలో కుక్క.. సేవలో ఎద్దు.. నిరంతర శ్రమలో చీమ... నిశిత దృష్టిలో గద్ద... గానంలో కోకిల.. నాట్యంలో నెమలి.. పౌరుషంలో పొట్టేలు..సాహసంలో పులి... పరాక్రమంలో సింహం... ఆదర్శంగా నిలుస్తాయి.

వీటిని ఆలోచించే శక్తిలేకపోయినా తనదైన ప్రత్యేకతతో జీవిస్తాయి.

ఆలోచనాశక్తి ఉన్న మనిషి మాత్రం చిన్న ఓటమికి తల్లడిల్లుతున్నాడు. భావోద్వేగాలతో కుంగి పోతున్నాడు. "

పక్కనున్న గ్లాసందుకుని కొంచెం నీళ్లుతాగి మళ్లీ చెప్పాడు.

" నిజమే.

ఓటమి అవమానభారాన్ని పెంచుతుంది.

ఆత్మన్యూనత, ఆందోళన, భయం, దుఖం, నైరాశ్యం లాంటి వాటికి కారణమవుతుంది.

బతుకుపైన తీపిని చంపుతుంది. కొన్నిసార్లు ఆత్మహత్యకు పురిగొల్పుతుంది కూడా. "

ఓ సారి చుట్టూతా పరికించి చూసి మళ్లీ చెప్పటం కొనసాగించాడు రామస్వామి.

“ప్రేమ వైఫల్యం, కుటుంబ కలహాలు, ఆర్థిక సమస్యలు, వృత్తి వ్యాపారాల్లో ఒత్తిడి, సమీప బంధువుల మరణం... ఇలా ఏదో ఒక అంశంలో జీవితం విసిరే సవాళ్లు తట్టుకోలేని వేదనను మిగులుస్తున్నాయి.

మనం తప్ప ప్రపంచమంతా సుఖసంతోషాలతో మునిగి తేలుతుందనుకుంటాం. నిర్బంధ మరణాన్ని స్వాగతిస్తున్నాం. ” ఉలిక్కిపడ్డాను నేను.“ ఇతను చెబుతున్నది నా గురించేనా?” అనుమానపడ్డాను.

“పుట్టిన ప్రతి మనిషి చనిపోవలసిందే. కానీ మనకి మనమే మరణశాసనం లిఖించుకోవటం మాత్రం అవివేకం. సమస్య ఎంత తీవ్రమయినదయినా అది మనం ప్రాణం తీసుకునేటంత పెద్దది కాదు... అది గ్రహించలేకపోతున్నాం.

కాయకష్టం చేసుకునే పేదవాళ్లే నయం. వాళ్లు అంత తేలిగ్గా ఆత్మహత్య చేసుకోరు. చదువుకున్న వాళ్లలోనే ఇదంతా. ఆయనను చూడండి. తన ఆఫీసులో పనిచేసే కొలీగ్ ని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. తర్వాత ఆమెను ఉద్యోగం కోసం అమెరికా పంపాడు. కొన్నాళ్లకి ఆమె అతనితో సంబంధాలు తెంచుకుంది. అక్కడ మరో వ్యక్తితో ప్రేమలో పడింది. అంతే.. ఊహించని ఈ పరిణామంతో అతను కంగుతిన్నాడు. ఆత్మహత్యకు సిద్ధమయ్యాడు. ఈ క్లబ్ చొరవ తీసుకోకపోయి ఉంటే మన మధ్య అతన్ని చూడలేకపోయేవాళ్లం.

ఆయనే కాదు..

సినిమాలు, స్టాక్ మార్కెట్ లో పెట్టుబడి పెట్టి భారీగా నష్టపోయినవాళ్లు.. ఐదు పదులు దాటిన వయసులో హఠాత్తుగా ఉద్యోగం ఊడి కుటుంబం రోడ్డున పడటంతో భరించలేని వాళ్లు... చదివిన చదువుకు తగిన ఉద్యోగం లభించక వేసారి పోయిన వాళ్లు... ఇలా ఈ గదిలో నాతో సహా ఉన్న ప్రతి ఒక్కరూ... ఏదో ఒక సమస్య బారిన పడ్డవారే. ప్రాణాలు తీసుకోవాలనుకున్నవారే. ఏదో అదృశ్య శక్తి చివర్లో మనల్ని కాపాడింది. అందుకే ఈ క్లబ్ ని ఏర్పాటు చేశాం. జీవితంలో ఓడిపోయిన వాళ్లమందరూ ఒక చోట అనుభవాలను కలబోసుకుంటున్నాం.

ఓటమి బాట నుంచి గెలుపు దారిలోకి జీవితాన్ని ఎలా మళ్లించుకున్నామో వివరంగా చెబుతున్నాం. ఇంకెవరూ ప్రాణం తీసుకోకుండా చూస్తున్నాం..."

ఫెయిల్యూర్ క్లబ్ అంటే ఏమిటో ఆ నిముషంలో నాకు అర్ధమయింది. రామస్వామి మాట్లాడుతుంటే ఆత్మీయమైన వ్యక్తి కళ్లముందున్న కదులుతున్న అనుభూతి కలిగింది. ' పక్కవాడి జీవితంలోకి తొంగిచూస్తేగానీ... మనం ఎదుర్కొంటున్న సమస్య అంత తీవ్రమైనది కాదన్న విషయం అర్ధం కాదు. ఇంకా వివరంగా చెప్పాలంటే..

చెప్పులు లేవే అని మనం బాధ పడుతున్నప్పుడు...అసలు కాళ్లే లేని వ్యక్తి కంటపడితే గానీ మనం ఎంత అదృష్టవంతులమో అర్ధం కాదు. " చెప్పుకుపోతున్నాడు ఆయన.

"జీవితంలో సానుకూల దృక్పథం అవసరం. అది ఉన్నప్పుడు ఎంతటి క్లిష్టమైన సమస్య ఎదురయినా సులువుగా బయటపడగలుగుతాం. ఓటమి భయం దరిచేరదు. ఆత్మవిశ్వాసంతో సవాళ్లను అధిగమించగలుగుతాం. గీత, బైబిల్, ఖురాన్ వంటి పవిత్ర మత గ్రంధాలను తీసుకోండి. వాటిల్లో జీవిత సమస్యలకు పరిష్కార మార్గాలెన్నో కనిపిస్తాయి. డేల్ కార్నెగీ, విన్సెంట్ పీలే, వ్యాన్ డయ్యర్, ఆంథోని రాబిన్స్, స్టీఫెన్ కొవే, రాబిన్ శర్మ, జాక్ ఫీల్డ్, రాబర్ట్ ష్కుల్లర్, బాబ్ ప్రోక్టర్, జిగ్ జిగ్లర్ లాంటి విదేశీ రచయితలెందరో విజయసాధనకు, సంతృప్తికర జీవనానికి అవసరమైన దారులు చూపారు. తెలుగులోనూ నిపుణులయిన రచయితలెందరో పుస్తకాలు అందించారు. అంతెందుకు. తర్జాలంలో వందలాది పేజీల సాహిత్యం అందుబాటులో ఉంది. ఇవన్నీ ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోటానికి మనకు కొంతయినా సాయపడతాయి. ఆత్మహత్యకు కొద్దినిముషాలు వాయిదా వేసుకుంటే చాలు.. క్రమంగా ఆ భావననుంచి తేలిగ్గా బయటపడగలుతారు ఎవరయినా " ప్రవాహంలా సాగుతోంది రామస్వామి ప్రసంగం. అది ఎప్పటికి ముగుస్తుందో తెలిదు.

నా మెదడులో కదలిక... ఆలోచనలు కొత్త చివుళ్లు తొడుక్కుంటున్నాయి. "నేనూ, ప్రణవీ తెలివితక్కువ నిర్ణయం తీసుకున్నామా?" నాలో ఏదో తెలియని సంఘర్షణ...ఇక అక్కడ ఉండాలనిపించింది.

గబగబా బయటకొచ్చేశాను.

----------------------------------------------------------

“ రాత్రి ఏమై పోయావ్… మొబైల్ తీయలేదు. ఇక్కడికి రాలేదు”   బుంగమూతి పెట్టి ప్రేమ, కోపం మిళితమైన స్వరంతో అడిగింది ప్రణవి. ‘ ఈ వంతెన మీదే అర్ధరాత్రి వరకూ ఎదురుచూసి ఆటోలో ఇంటికెళ్లిపోయాను. నువ్వు నన్ను మోసం చేశావని రాత్రంతా ఏడుస్తూ ఉండిపోయాను తెలుసా? ”

అదేం పట్టించుకోనట్టుగా… “ మనం పెళ్లెప్పుడు చేసుకుందాం” అన్నాను ఆమె చేతిని నా చేతుల్లోకి తీసుకుంటూ.

ఊహించని   నా   ప్రతిస్పందనకు ఆమె   ఆశ్చర్యపోయింది.

“ ఇంత మామూలుగా ఎలా ఉండగలుగుతున్నావ్”… అంది.

నా మెహంలో ప్రసన్నత   ఆమెకు మింగుడుపడటంలేదనుకుంటా.

“ యాదగిరి గుట్ట వెళదామా? ” అన్నాను మళ్లీ.

“ దేనికి? ఇప్పుడా?” ..ప్రణవి అడిగింది.

“ చెప్పాగా… పెళ్లి చేసుకుందాం” అన్నాను ఆమెను దగ్గరకు తీసుకుంటూ.

తను ఇంకా ఏదో మాట్లాడబోతుంటే.. మధ్యలోనే అడ్డుకున్నాను.

నిన్నటి విషాదం గురించి నాకు తలుచుకోవాలనిపించలేదు. అందమైన భవిష్యత్తును కలలుగంటున్నాను.

మామూలుగా బతకటం కాదు..

అర్ధవంతంగా జీవించటం గురించి ఆలోచిస్తున్నాను.

అందుకు మానసికంగా సిద్ధమయ్యాను కూడా. ఆ విషయం ముందే ప్రణవికి చెప్పాలనిపించలేదు.గెలుపు ... తన చుట్టూ పొగిడే గుంపును సృష్టించుకుంటే..

ఓటమి... తనను తాను తెలుసుకునేలా చేస్తుంది. ప్రయత్నిస్తే కొత్త జీవితానికి బాటలు పరుస్తుంది. ఫెయిల్యూర్ క్లబ్ లోకి అడుగుపెట్టి నేను తెలుసుకున్న జీవిత సత్యం ఇదే.. మనసులోనే క్లబ్బుకు జోహార్లు అర్పించాను. ఆ తర్వాత ...

అదే వంతెనపైన ఎన్నో అందమైన సాయంత్రాలు

మా మధ్య ఆహ్లాదంగా గడిచాయి. ఉద్యోగం, పెళ్లి, ఇద్దరు పిల్లలతో మా జీవితం ఓ మంచి కథలా సాగిపోయింది.




హలో! నేనొక పిల్లిని. నా గోడు వింటున్నందుకు , సారీ, చదువుతున్నందుకు మీకు నా ధన్యవాదాలు. నేను ఇప్పుడు పుట్టెడు

దుఖ్ఖంలో వున్నాను. మా పిల్లులందరికీ తెలుసు దానికి కారణం. కొంతమంది మనుషులకి కూడా ఈ విషయం తెలుసు. బాధ పంచుకుంటే తగ్గుతుందంటారు కదా. అందుకే ఇలా మీతో...

అసలు పిల్లులంటే ఈ దేశపు మానవులకు గుర్తొచ్చేదేమిటి? మేమొక చెడ్డ శకునమని. మమ్మల్ని పెంచుకునే వాళ్ళున్నా కూడా సాధారణ ప్రజానీకం మమ్మల్ని లోకువ చేసి చూస్తారు. మా జాతి వైరి అయిన కుక్కల్ని ప్రేమిస్తారు వాళ్ళు, వాటికి పిచ్చిపడితే యజమానిని కూడా కరుస్తాయి. అయినా సరే, మానవులు మమ్మల్ని చులకన చేసి, మా తోకల్లో మహాపాతకాలుంటాయని దుష్ప్రచారం చేస్తుంటారు. మరి మా పొట్టకూటికై బయటకి వెళ్ళేటప్పుడు యీ మానవులు ఎదురుపడతారు కదా! మరి మేమేం కావాలి?

పెళ్ళంటేనూరేళ్ళపంట, పందిళ్ళు , సందళ్ళు, తప్పెట్లు, తాళాలు, తలంబ్రాలు, వగైరా అని చెప్పే మనుషులు, పెళ్ళికి వెళ్తూ మా జాతి వాళ్ళని చంకలో పెట్టుకుని వెళ్తే అశుభమని అంటారు. మాకు మాత్రం మీ పెళ్ళిళ్ళు, వాటి భోజనాలు అంటే ఆశ వుండదా..

మా మూతులు చిన్నవిగా వుంటాయి కదా! అందుకు "పిల్లి మూతి" అని మెచ్చుకోలుగా అంటారు మానవులు. ఇది ఇలా వుంటే. ఈ మధ్య ఇ-మెయిల్లో ఒక మెయిలు ప్రాచుర్యం చెందింది. దాని సారంశం ఏమిటంటే ఆడవాళ్ళు ప్రేమించబడడానికి కుక్కని కొనాలట. ఇంట్లో గారాలు పోయే మనిషి కావలంటే పెళ్ళి చేసుకునే బదులు పిల్లిని కొనుక్కోవాలట! ఎంత ఏక పక్ష వాదమో చూశారా! పైగా, పుండు మీద కారం జల్లినట్టు మా శత్రువుని మెచ్చుకోవడం ఒకటి!

మా ఆయువు చిన్నదైనప్పటికీ, మాకు తొమ్మిది ప్రాణాలుంటాయని, అంత సులభం గా చావమని, గేలి చేస్తూంటారు ఈ మానవులు. ఏదో ప్రాణభీతితో ఎక్కడో దాక్కుంటే ఇదండీ ఈ మానవుల వరుస! పిల్లి జన్మనెత్తితే జపాన్లో ఎత్తాలని ఈ మధ్య మా సంఘం వాళ్ళు అన్నారులెండి. మా సోదరుడు. "తమ" ని, స్టేషన్ మాస్టర్ గా పని చేయనివ్వడమే కాకుండా ఆయన పరమపదించాక ఆయన పేరులో ఓ స్మారకం కట్టి పూజిస్తున్నారట అక్కడి మానవులు. అంటే పూరవ జన్మ సుకృతం దండిగా వుండాలన్నమాట!

అదెలాగూ ఈ జన్మకు లేదు కాబట్టి నా గోడు కొనసాగిస్తాను. మేము నిళ్ళోకిసుకుంటే, యీనితే ఏడిళ్ళు మారుతామని ఈసడిస్తారే వీళ్ళు, కానీ భద్రతా దృష్ట్యా మేము ఈ పనులు చేస్తామని గ్రహించరు.

ప్రకృతిపరం గా ప్రాప్తించిన మా దాంపత్యాన్ని "మార్జాల దంపత్య" మని వెక్కిరిస్తారే ఈ మానవులు! నాకు తెలియక అడుగుతాను,

వీళ్ళ సినిమాల్లో వుండే దాంపత్యం ఎలాంటిదో గురివింద గింజలు వీళ్ళు!

మాతృత్వానికొస్తే, వీళ్ళ పూర్వీకులైన తల్లి కోతులు, వాళ్ళ పిల్లల్ని పట్టించుకోవు: ఆ పిల్లలే స్వజాగ్రత్త కోసం తల్లుల్ని అంటి పెట్టుకుంటాయి. ఆ విషయం చూడండి. పిల్లల్ని, అంటే పిల్లుల్ని, కనేటప్పుడు ఏడిళ్ళు మారుతా కదా! ఇంకా , మేము మా పసివాళ్ళని నోట కరుచుకుని తిరుగుతాం. మా పిల్లలని కాపాడుకునే మనో స్థైర్యం మాకుంది. కొంతమంది మానవులు మాత్రం అమానుషం గా వాళ్ళ పసికందుల్ని కుప్ప తోటల్లో వేస్తారట కదా! ఇంకా కొంతమంది శరణాలయాలలో చేరుస్తారట: మరి కొందరేమో అమ్ముకుంటారుట! కొన్ని చోట్లయితే శిశువుని కడుపులోనే చంపేస్తారుట కూడా! మా మంచితనం ఇప్పుడైనా అర్థమయిందా.

ఇంకా , మా నడక ఎప్పుడూ చౌర్యం, రహస్యం - ఇలా చెడ్డ వాటితో ముడిపడి వుంటుంది. మా ప్రాణాలు కాపాడుకోవడానికి జాగ్రత్తగా అడుగు చప్పుడు చెయ్యకుండా మేము నడుస్తే మాకు ఇలా చెడ్డ ఉద్దేశ్యాలు ఆపాదిస్తారు. మా విషయానికొస్తే ఇలా అనుకునే మనుషులు అమ్మాయిలని మాకులాగా నడిపించి , దానికి ఇంగ్లీషులో "కాట్ వాక్ " అని పేరు పెట్టుకుని, అలా నడిచిన వాళ్ళలో కొంతమందికి ఫలానా సుందరి, అని పట్టం కడుతూ వుంటారట! ఒక్కో జాతికీ ఒక్కో న్యాయం, ఈ మానవులకి.

రెండు పిట్టలు కొట్టుకుంటే న్యాయం చెప్పే నెపంతో మేము అన్యాయం చేస్తామని అంటారు మానవులు. అయ్యో , అమ్మో! మా సంగతి వదిలెయ్యండి. నాగరికులమైన మీ సమాజాల్లో అన్యాయాలు లేకుండా , ధర్మం నాలుగు పాదాలు నడుస్తోందా?

ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే మా జాతి మీద మీకున్న అపోహలు తొలగించడానికి. తొలగిపోయాయండీ? అయ్యయ్యో లేదా? లేకపోతే ఈ కథనంతటితో ముగించకుండా సశేషం , చేస్తాను. దానికి మీరు రెడీనా?




"మిమ్మల్ని ఇంతకుమందు ఎక్కడో చూసాను" అన్నాడు అవినాశ్ హఠాత్తుగా.

చటుక్కున తలెత్తి అతని కళ్ళల్లోకి చురుగ్గా చూసాడు భీమారావ్. ఓ క్షణకాలం అలా తేరిపార జూసాక నవ్వేసాడు.. "నెల రోజులుగా నన్ను చూస్తూనే వున్నావుగా!"

"కాదులెండి. మొదటిసారిగా మిమ్మల్ని చూసినప్పుడే కలిగింది. నాలో ఆ ఫీలింగ్. అయితే ఎక్కడ చూసావో మాత్రం గుర్తుకు రావడం లేదు" అన్నాడు. అవినాశ్ చిరునవ్వులో.

రమ్మీ ఆడుతున్నారు ఇద్దరూ.

కాసేపటికి, "షో" అంటూ పేకలు కిందపడేసి ఇవాళ్టి పేక ఆట చాలిద్దాం, అన్నాడు భీమారావ్.

అవినాశ్ విస్తుపోయి, అదేమిటీ? మనం ఆట ప్రారంభించి గంట కూడా కాలేదుగా!? అన్నాడు.

"ఇవాళ ఒంట్లో కొంచెం అనీజీగా వుంది. అందుకే .." భీమారావ్ లేచాడు.

అవినాశ్ కూడా లేచి , "అయితే రెస్ట్ తీసుకోండి. సాయంత్రం కలుద్దాం" అంటూ బైటకు నడిచాడు.

శ్రీశైల క్షేత్రానికి సమీపంలో ఘాట్ రోడ్ పక్కనున్న ఓ హెల్త్ రిసార్ట్ అది.

నగరాలలోని పొల్యూషన్ కు దూరంగా వున్న ఆ ప్రదేశానికి ఆరోగ్యం మెరుగుపరచుకోవడానికో , కొద్ది రోజులపాటు బిజీ లైఫ్ ను మర్చిపోయి ప్రశాంత జీవనం గడపడానికో శ్రీమంతులు కొందరు వస్తూంటారు.అందుకు అవసరమైన వసతి సదుపాయాలు అక్కడ లభిస్తాయి. మెడికల్ డిస్పెన్సరీతో సహా, ఇరవై ఐదేళ్ళ అవినాశ్ హ్యాడ్సం గా వుంటాడు. సంపన్న కుటుంబానికి చెందిన అతను చిత్రలేఖనాన్ని ప్రవృత్తిగా చేసుకున్నాడు.

ఏడాదికోసారిగా ఆ సుందర ప్రకృతిని తన కుంచెతో ఈ సెల్ఫ్ లో బంధించేందుకని హైద్రబాద్ నుండి వస్తూంటాడు.తనకు ఇష్టమైనన్ని రోజులు అక్కడ గడుపుతూంటాడు.

అవినాశ్ అక్కడకు వచ్చి నెలయింది, ఉదయం , సాయంత్రం వాకింగ్ .. పగలు ఆ రమణీయ ప్రకృతి అందచందాలను కాన్వాస్ లోకి ఎక్కించి కుంచెతో రంగులు దిద్దడం .. కూడా తెచ్చుకున్న ల్యాప్ ట్యాప్ మ్యూజిక్ సిస్టంస్ , పుస్తకాలతో కాలక్షేపం.. దూరంలో గోచరించే భ్రమరాంబా మల్లిఖార్జునుల ఆలయ శిఖరాల వైపు చూస్తూ మైమర్చిపోవడం - ఇవీ అతని దినచర్యలు..

ఐతే భీమారావుతో పరిచయం అందులో స్వల్ప మార్పులను తెచ్చింది.

ఆ రిస్సార్ట్ లోని కాటేజ్ లలో అందమైన చిన్న పూదోట నడుమనున్న నక్షత్రాకారపు కాటేజ్ కొంచెం విశాలంగా ముచ్చట గొలుపుతూంటుంది.

అవినాశ్ ఎప్పుడు వచ్చినా అందులోనే బస చేసేవాడు. ఈ సారి అది ఖాళీ లేదు.

అందులో భీమారావ్ వుంటున్నాడు. భీమారావ్ దాన్ని ఆర్నెళ్ళకు బుక్ చేసుకోవడం జరిగింది.

భీమారావుకు యాభై ఏళ్ళుంటాయి. మనిషి సన్నమైనా దృడంగా వుంటాడు. పొడవూ పొట్టి కాని విగ్రహం , కలకత్తా నుండి వచ్చిన ఓ బిజినెస్ మేన్ అట అతను, నాలుగు నెలల క్రితం బైపాస్ సర్జరీ జరిగిందట. ఆ రిసార్ట్ గురించి ఎవరో చెబితే, విశ్రాంతి కోసం కూతురు సాగరికతో మూణ్ణెల్ల క్రితం అక్కడకు వచ్చాడట...

మార్నింగ్ వాక్ లో అతనికి పరిచయమయ్యారు ఆ తండ్రి , కూతుళ్ళు.

సాగరికకు ఇరవై ఏళ్ళుంటాయి. తెల్లగా, స్లిం గా , పొడుగా వుంటుంది. కాటుక దిద్దిన కలువ కన్నులు, అందమైన నాసిక, శంఖాన్ని పోలిన నున్నని కంఠం... సాధారణ అందమే అయినా , మళ్ళా మళ్ళా చూడాలనిపించే రూపం ఆమెది.

తొలి చూపులోనే సాగరిక తన మనసును వశపరుచుకోవడంతో వారితో పరిచయం పెంచుకున్నాడు. అవినాశ్. తన ప్రవర్తనతో క్రమంగా అతన్ని ప్రసన్నం చేసుకోగలిగాడు..

సాగరిక బిడియస్తురాలు, మిత భాషిను. తన చిత్రాలను చూసి విప్పారే ఆమె కనులు, ఆనందాన్ని మరుగుపరచలేని ఆమె స్పందన చూస్తే ముచ్చట గొలిపేది అవినాశ్ కు. ప్రకృతి కాంతను అతను వివిధ రూపాలలో చిత్రిస్తూంటే దగ్గర కూర్చుని ఆరాధనగా అతని వదనం లోకి చూస్తూండిపోయేది సాగరిక.

అతను చింత్రించిన తన అందాలను చూసుకుని మురిసిపోయేది. తన చిత్రపటాన్ని భీమారావ్ చూడకుండా బద్రంగా దాచుకుంది.. అప్పుడప్పుడూ ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ ఆ అందాల ప్రకృతుల మధ్య అడుగులు వేస్తూ, చిన్నపిల్లల్లా కేరింతాలు కొట్టేవారు. ఆమె నవ్వు అతన్ని పరవశింపజేసేది. ఆమె ప్రేమలో పడ్డ అవినాశ్ కు ఆమె మనసేమిటో ఆకళింపు అయ్యేది కాదు.

భీమారావ్ రెండు వేళలా వాకింగ్ కు తప్ప కాటేజ్ వదిలేవాడు కాదు. అతనికి కాలక్షేపం కోసమని రోజుకోసారైనా తోటలోని కాటేజ్ కు వెళ్ళి అతనితో పేకాట ఆడేవాడు అవినాశ్. ఆ వంకను సాగరికను చూడాలన్న ఆలోచన కూడాను అతనిది.

వారు ఆడుకుంటూంటే దగ్గర కూర్చుని చూస్తూండేది ఆమె. మధ్య మధ్య రిఫ్రెష్ మెన్ట్స్ అందించేది. ఒక్కోసారి ఆమె బలవంతం పైన అక్కడ భోజనం కూడా చేసేవాడు అవినాశ్.

ఆ మధ్య భీమారావ్ వాకింగ్ టైమింగ్స్ మారిపోయాయి. ఒంట్లో బాగోలేదంటూ పేకాడడం కూడా తగ్గించుకున్నాడు.

సాగరిక కూడా మునుపటిలా ఎక్కువగా బైట కనిపించడం మానేసింది.

భీమారావును ఎక్కడో చూసాను అన్న భావన అవినాశ్ మదిని వదలడం లేదు.

అదే విషయం సాగరికతో అంటే నవ్వి ప్రపంచం లో ఒకే పోలికలోని మనుషూ ఏడుగురు ఉంటారట! డాడీని పోలిన మరో వ్యక్తిని ఎక్కడో చూసే వుంటారు అంది.

ఓసారి నెట్ సర్ఫ్ చేస్తుంటే ఆ విషయం గుర్తుకువచ్చింది అవినాశ్ కు సాలోచనగా ఏదో సైట్ ను ఓపెన్ చేసి లింకులు క్లిక్ చేసాడు.

అంతే ఝూం ఝూం మారుతం సోకిన మబ్బులా మిస్టరీ వీడిపోయింది..

స్క్రీన్ పైన భీమారావ్ ఫోటో , అతని పుట్టుపూర్వోత్తారాలూ ప్రత్యక్షమయ్యాయి..

భీమారావ్ అసలు పేరు జగ్గారావ్. ఓ నొటోరియస్ క్రిమినల్ అతను! పెద్ద పెద్ద దొంగతనాలు, దోపిళ్ళూ, హైవే రాబరీనూ అతని ప్రత్యేకతలు.. నాలుగు మాసాలా క్రితం చెన్నయ్ లోని ఓ జ్యువెలరీ ఎక్జిబిషన్ నుండి సుమారు పాతిక కోట్లు విలువచేసే ఓ అరుదైన వజ్రాన్ని దొంగిలించి అదృష్యమైపోయాడు. పోలీసులు అతని కోసం గాలిస్తున్నారు..

నిర్ఘాంతపోయాడు అవినాశ్.

అంతకు మునుపు హైద్రాబాద్ లో వుండగా న్యూస్ పేపర్ లో , టీవీ చానెల్స్ లో అతని ఫోటోలు చూసిన విషయం గుర్తుకువచ్చింది. జగ్గారావ్ మారు పేరుతో ఆ మారుమూల ప్రాంతం లో దాక్కుంటాడని ఎవరు ఊహించగలరు!? భీమారావ్ ను కొద్ది రోజులపాటు గమనించి, అతని గురించి మరిన్ని వివరాలు సేకరించి కాని పోలీసులకు సమాచారాం అందించకూడదనుకున్నాడు. అవినాశ్.

ఐతే సాగరికతో తన ప్రేమ ఏమవుతుందోనన్న బెంగ కూడా పట్టుకుంది.

ఆ రోజు పేకాడుతూ హఠాత్తుగా అన్నాడు భీమారావ్ . రేపు మేము కలకత్తా వెళ్ళిపోతున్నాం.

సాశ్చర్యం గా చూసాడు అవినాశ్. మరో మూణ్ణెళ్ళ వరకు ఇక్కడే వుంటామన్నారుగా?

నిజమే కాని నేను దగ్గర లేకపోవడంతో బిజినెస్ లో ఏవో సమస్యలు తలెత్తాయని మేనేజర్ ఫోన్ చేసాడు. చెప్పాడు భీమారావ్, పేక ముక్కల మీంచి దృష్టి మరల్చకుండానే .

అప్రయత్నం గా సాగరిక వదనం లోకి చూసాడు అవినాశ్.

ముఖం త్రిప్పుకుని లోపలికి వెళ్ళిపోయింది ఆమె. మన స్నేహానికి గుర్తుగా ఇవాళ రాత్రి కాక్ టెయిల్ పార్టీని ఏర్పాటుచేస్తున్నాను, మళ్ళా అన్నాడు భీమారావ్.

కాక్ టెయిల్ పార్టీ తోటలో అరేంజ్ చేయబడింది. జిన్, చికెన్-65, మటన్ మసాళా, ప్రాన్స్ కర్రీ, ఫిష్ ఫ్రై, వగైరాలు వున్నాయి. అవన్నీ కాటేజ్ అటెండెంట్ ను సమీపం లోని టౌన్ కు పంపించి తిప్పించాడు భీమారావ్. వంటకాలు మాత్రం సాగరిక చేసింది..మగవాళ్ళిద్దరూ కబుర్లు చెప్పుకుంటూ డ్రింక్ చేస్తూంటే , కొంచెం ఎడంగా కూర్చుని ముభావం గా చూస్తోంది ఆమె.అవినాశ్

ఆమె వంక దొంగ చూపులు చూస్తున్నాడు. వారు వెళ్ళిపోయే లోపున ఆమెకు తన ప్రేమను వెళ్ళడించి ఆమె మనసు తెలుసుకోవాలని తహతహలాడుతున్నాడు అతను. కాని, రెండు రోజులుగా ఆమెతో ఏకాంతం లభ్యం కావడంలేదు..

పైగా, భీమారావ్ అక్కడనుంచి అదృశ్యమయ్యే లోపలే పోలీసులకు ఏదో విధం గా సమాచారం అందించవలిసి వుంది కూడాను. డ్రింక్స్ ఓ రౌండ్ పూర్తయింది. రెండో రౌండ్ ప్రపోజ్ చేసాడు భీమారావ్.

అవినాశ్ వద్దన్నాడు. అరుదుగా డ్రింక్ చేస్తాడు అతను. అదీ, స్నేహితుల బలవంతం పైన..

జిన్ లేడీస్ డ్రింక్. ఎంత త్రాగినా పరవాలేదు అన్నాడు భీమారావ్ నవ్వుతూ. ఈసారి డ్రింక్సు ను తానే స్వయం గా కలుపుకు వస్తానంటూ లేచి లోపలికి వెళ్ళాడు.

సాగరిక అతన్ని అనుసరించింది.

కాసేపటికీ భీమారావ్ తిరిగివచ్చాడు.

అతని వెన్నుకే డ్రింక్ గ్లాసులు పట్టుకుని వచ్చింది సాగరిక.

భీమారావ్ అక్క బిజినెస్ ఊసుల మధ్య డ్రింక్ చేయసాగారిద్దరూ. అతని నోటినుండి తెల్లటి నురగలు వచ్చాయి. అవినాశ్ కంగారుగా లేచి అతన్ని పిలుస్తూ కుదిపి చూసాడు. నాడి పడిపోతున్నట్లు అనిపించడంతో "కాల్ ద డాక్టర్ క్విక్ " అంటూ అరిచాడు, సాగరికనుద్దేంచి. ఆమె కూర్చున్న చోటు నుండి కదల్లేదు. అవసరం లేదు. అతను బ్రతకడు అంది నిర్లిప్తంగా. అతను త్రాగిన డ్రింక్ లో విషం కలిసింది.

అదిరిపడి చూసాడతను.

అవును. విషం కలిసిన డ్రింకును అతనికిచ్చింది నేనే అంది మళ్ళా.

ఏ వై.. షాక్ తిన్నాడు అవినాశ్.

నేను అలా చేసుండకపోతే ఇప్పుడు అతనున్న స్థితిలో మీరుండేవారు. ఆమె గొంతుక స్వల్పంగా కంపించింది. తెల్లబోయాడు అతను. అవినాశ్ తనను గుర్తుపట్టినట్టు గ్రహించిన జగ్గారావు ఉరఫ్ భీమారావ్ తన దారి నుంది తొలగించుకోవాలనుకున్నాడు. అందుకే అక్కడ్నుంచి వెళ్ళిపోతున్నట్టు కాక్టైల్ కు ఆహ్వానించాడు. రెండో రౌండ్ లో డ్రింక్స్ స్వయం గా కలుపుతూ అవినాశ్ డ్రింకులో విషం కలిపాడు. ఆ విషయం చాటు నుండి గమనించిన సాగరిక , తెలివిగా గ్లాసులు మార్చేసింది.

ఆమె చెప్పింది ఆలకించి నిశ్చేచ్ఛుడయ్యాడు అవినాశ్. భీమారావ్ ముక్కు దగ్గర వేలు పెట్టి చూసాడు అవినాశ్. ప్రాణం పోయి చాలాసేపు అయింది. నాకోసం చేతులార చంపేసావంటే నమ్మలేకపోతున్నాం అన్నాడు సాగరికతో. అతను నా తండ్రి కాడు.

చిత్రం గా చూసాడు.

ఆమె చెబుతున్న వివరాలు అతన్ని అచ్చెరుపాటుకు గురిచేసాయి. పదేళ్ళ క్రితం ఓ పడవ ప్రమాదం లో తల్లిదండ్రులను కోల్పోయిన సాగరికను చేరదీసి, పెంచి పెద్ద చేసాడు గజదొంగ జగ్గారవు. తన వృత్తి కార్యక్రమాలను దక్షిణాది రాష్ట్రాలలోనే కొనసాగించేవాడు. నాలుగు నెలల క్రితం చెన్నై లోని అన్నా శాలై లో జరిగిన ఓ జ్యువెలరీ ఎక్జిబిషన్ ది విలువైన వజ్రం దొంగిలించాడు అతను. పోలీసులనుండి తప్పించుకునేందుకు ఆ రిసార్టు కు వచ్చి మారు పేరుతో తలదాచుకున్నాడు... అవినాశ్ తనను ఎక్కడో చూసినట్టు చెప్పడంతో, వార్తా పత్రికలలో, టీవీ చానెల్స్ లో తన ఫోటొలను చూసి వుంటాడని ఏక్షణం లోనైనా తన అసలు స్వరూపం గుర్తించవచ్చని భయపడ్డాడు. కాక్టెయిల్ పేరుతో అవినాశ్ ను హతమార్చానుకున్నాడు.

ఆ విషయం పసిగట్టిన సాగరిక అప్రమత్తతో అవినాశ్ ప్రాణాలను కాపాడింది.

కొయ్యబారిపోయాడు అవినాశ్.

నాది కృతజ్ఞతే అయినా మంచిని బ్రతికించడం కోసం చెడును చంపక తప్పలేదు. ముఖం చేతుల్లో కప్పుకుని దుఖ్ఖించింది సాగరిక. నీకు నా కృతజ్ఞతలు ఎలా తెలుపుకోవాలో తెలియడంలేదు ఆర్ద్రం గా అన్నాడు అవినాశ్. సాగరికా తొలిచూపులోనే నా

హృదయం దోచుకున్న స్త్రీవి నువ్వు. నీకు సమ్మతమైతే నిన్ను నా అర్ధాంగిని చేసుకోవాలనుకుంటున్నాను.

చటుక్కున తల ఎత్తి అతని కళ్ళల్లోకి చూసింది సాగరిక. అంతలోనే లజ్జాభారంతో ఆమె కనులు వాలిపోయాయి. కాలిబొటన వ్రేలితో నేల మీద రాస్తూ వుండిపోయింది.




“ఈ రోజు నేను ఈ స్థితిలో ఉన్నానంటే దానికి కారణం వెంకటరాజు మాష్టారు గారే” వేదిక మీద రాజు ఉపన్యాసం సాగుతోంది. వింటున్న నాకు ఒళ్ళు మండిపోతుంది. వేదిక మీద ఉపన్యాసాలు ఇవ్వడానికి అందరూ పెద్దమనుషులే! చేతల దగ్గరే ముఖం చాటేస్తారు. ఎన్నిసార్లు వాడితో దూరవాణి ద్వారా మాట్లాడారు? “మాష్టారి ఆర్థిక పరిస్థితి బాగాలేదు. సన్మానం పేరుతో పూర్వ విద్యార్థులమంతా కలిసి ఏదైనా చేస్తే మాష్టారికి కొంత వెసులుబాటుగా ఉంటుంది. నువ్వేం చెయ్యగలవు?” అంటే “చూద్దాం వస్తాను కదా!” అనేసాడు. వాడుండేది అమెరికాలో. ఇదిగో, అదిగో అనీ ఆరు నెలల కాలం గడిచిపోయింది. అయినా వాడంటేనే మాష్టారికి వల్లమాలిన అభిమానం.

“వాడు ఇక్కడకు వచ్చినప్పుడే సన్మానం కార్యక్రమం పెట్టుకుందాము” అనేసారు. “మనందరికన్నా వాడు పెద్ద స్థాయిలో ఉన్నాడు కదా! వాడూ కలిస్తే కాస్త పెద్ద మొత్తం అవుతుంది. వాడు వచ్చినప్పుడే ఈ సన్మానం పెట్టుకుందాము” అని మిగిలిన వాళ్ళూ

అనేసారు. దాంతో ఇదిగో అనుకున్న పదినెలల తరువాత .... ఎప్పుడు?     పెద్ద పండుగ అప్పుడు అనుకున్నారు తనూ, వాసూ. పండక్కి సొంత ఊరు వెళ్ళినప్పుడు, మాష్టారి దగ్గరకు వెళితే..... మాష్టారిని చూసి చాలా కష్టమనిపించింది. అద్దె ఇంట్లో.. వచ్చిన కొద్ది మొత్తం పెన్షన్ తో బార్యా భర్తలిద్దరూ.... ఇప్పుడు మాష్టారి ఆరోగ్యం     కూడా అంత బాగా లేదు. చూడడానికి మాష్టారికి పిల్లల్లేరు. జీతం వెనకేసుకోకుండా అందరి కిందా ఖర్చు పెట్టేసారు. అప్పుడనిపించింది. శిష్యులమంతా కలిసి ఏదైనా చేస్తే బాగుంటుంది కదా అని. ఆ ఆలోచనను వాసు బలపరిచాడు. అప్పటి నుండి అందరి చిఋనామాలు సంపాదించడం, వాళ్ళకు విషయం చెప్పడం... కొంతమంది వెంటనే అలాగే అంటే, కొంతమంది ఎటూ తేల్చకుండా... మరికొంతమంది సాధ్యం కాని ఆలోచనలు చెప్పడం. ఒకడైతే ఏకంగా ఇల్లు కట్టించేద్దాము అన్నాడు. మాష్టారిమీద వాడికున్న అభిమానానికి సంతోషమే కానీ... సరే నువ్వు ఎంత ఇస్తావు అంటే, “మనం ఓ వందమందిమి ఉండమా! తలా ఐదు వేలు వేసుకుంటే ఇల్లు కట్టించొచ్చు” అని లెక్కలు వేసాడు.

శిష్యులైతే ఉన్నారు కానీ వాళ్ళు ఇప్పుడు ఎక్కడ ఉన్నారు? అందులో ఎంతమంది కలుస్తారు? కలిసినా ఆ బాధ్యత ఎవరు తీసుకుంటారు? ఇవేవీ ఆలోచించకుండా మాటాడేస్తే ఎలాగ? ఎవరిని అడిగినా     “రాజుకి విషయం చెప్పారా! మనందరికన్నా పెద్ద స్థాయిలో ఉన్నాడు కదా! వాడైతే బాగా ఇవ్వగలడు” అన్నవాళ్ళే. మాకా విషయం తెలియదా! ఎంతో ప్రయత్నం మీద ఫోనులో దొరికాడు. “నేనొచ్చాక చూద్దాం” అనేసాడు. “ఎప్పుడొస్తావు?” అంటే     “ఈ మధ్య వద్దామనుకొంటున్నాను” అనడమే అప్పటినుండి. అప్పటికీ వాడి దగ్గరి స్నేహితుడు రవితో కూడా చెప్పారు. “వాడికి తీరిక లేదురా” అనేసాడు వాడు కూడా. ఇదిగో వారం క్రిందట వచ్చాడు. వాడితో మాట్లాడదామంటే ఫోనులో కూడా దొరకలేదు. వాసు వాడి దగ్గరకు వెళితే     “చూద్దాం ఆ రోజు వస్తాను కదా!” అనేసాడట. వాసు చాలా బాధ పడ్డాడు. కోపం కూడా వచ్చింది. ఎంత అంటే “ఇంక వాడిని అడగొద్దురా” అనేసాడు. అందరిదీ కలిపి లక్షా ఏభయ్ వేలు అయింది. వాడు ఇచ్చినది ఆ మొత్తానికి కలుపుదాము అనుకున్నాము ముందు. ఇప్పుడు “వాడి సంగతి మర్చిపో. డబ్బు కూడా నువ్వే ఇవ్వు. వాడి చేత ఇప్పించకు” అనేసాడు వాసు. పోనీ తనేమన్నా మాట్లాడదామన్నా ఆ అవకాశం కూడా దొరకలేదు. కార్యక్రమము మొదలుపెట్టే సమయానికి వచ్చాడు. మాష్టారితో పాటు వేదిక మీద కూచున్నాడు. ఇంకేం చేసేది? వాసు చెప్పినట్లే చేయాలి.

అందరూ గట్టిగా చప్పట్లు కొడుతుంటే ఆ శబ్దానికి ఈ లోకం లోకి వచ్చాను. అంత బాగా ఏం చెప్పాడో! ఇంత గట్టిగా చప్పట్లు కొట్టారు. అవునులే మాట్లాడడానికి మదుపేమిటి? ఎన్నన్నా చెప్పొచ్చు.     వాడి ఉపన్యాసం అయిపోయింది కాబోలు. తరువాత వారిని పిలవాలి మాట్లాడడానికి, అని లేవబోతున్నవాడిని వాడు ఇంకా మాట్లాడుతుంటే కూచున్నాను. “సరిగ్గా ఇరవై ఏళ్ళ క్రితం ఈ రోజే...... డిసెంబరు పదో తారీఖు .... శ్రీను, వాసు, రవి, రాజేశ్వరి, దుర్గ, లక్ష్మి, శ్యామల, చందూ, శ్యాం, నాయుడూ... మీ అందరికీ గుర్తుండే ఉంటుంది? ఆ రోజు మాష్టారు మన కోరికలను రాసుకు రమ్మన్నారు. గుర్తుందా! మన జీవితాలను ముఖ్యంగా నా జీవితాన్ని మలుపు తిప్పిన రోజు."

ఎందుకు గుర్తు లేదు? మరల గతం లోకి వెళ్ళిపోయాను.

“మాష్టారూ రేపటికి హోం వర్కు ఏమిటి?” ప్రతి రోజూ     హోం వర్కు ఇవ్వడం అలవాటు మాష్టారికి. మేము ఓ పదిమందిమి

పాఠశాల అయిన వెంటనే మాష్టారి ఇంటికి వెళ్ళి చదువుకునే వాళ్ళము. మాష్టారు ఓపికగా మాకు రానివి అన్నీ వివరంగా చెప్పేవారు. "జాగ్రత్తగా వినండిరా! మీ కోరికలు ఏమిటి? అవి ఎలా తిరుతాయి? రాసుకురండి. రేపటికి అదే మీకు హోం వర్కు." ఇదేం వర్కు? అందరమూ ముఖాలు చూసుకున్నాము." మీరందరూ జాగ్రత్తగా ఆలోచించి రాయాలి. మరోసంగతి. ఒకరితో ఒకరు చర్చించుకోకూడదు. బాగా ఆలోచించి రాయండి." మాష్టారు లోపలకు వెళ్ళిపోయారు. "ఒరే నీ కోరిక ఏమిటిరా!" నెమ్మదిగా అడిగాను వాసుని. "నా కోరికేమిటంటే..." ఆగిపోయి "మాష్టారు చెప్పొద్దు అన్నారు కదరా! నేను చెప్పను" అనేసాడు వాడు. అందరమూ పుస్తకాలు సర్దుకుని ఇళ్ళకు వెళ్ళిపోయాము. మరునాడు.. "అందరూ రాసారా! ఏవీ! మీ పుస్తకాలు ఇలా ఇవ్వండి" మాష్టారు. అందరికీ కుతూహలమే! మిగిలిన వాళ్ళు ఏం రాసారా అని. మాష్టారు అందరి పుస్తకాలూ ఓసారి చూసి "ఒరే కోరికలు ఎప్పుడూ పెద్దవి, గొప్పవి గానే ఉండాలి. ఉదాహరణకి.. నాకు చాక్లెట్ తినాలని ఉంది. ఓ పది రూపాయలు ఉంటే ఆ కోరిక తీరుతుంది. ఇక్కడ కోరిక చాక్లెట్ తినడం. తీరే మార్గం పదిరూపాయలు ఉండడం. జాగ్రత్తగా వినండి. పది రూపాయలు ఉంటే అప్పటికి మాత్రమే ఆ కోరిక తీరుతుంది. ఎప్పుడూ కోరిక తీరాలంటే ? చాక్లెట్ తయారు చేసే ఫేక్టరీ పెట్టాలి. అర్ధమవుతుందా! అంటే కోరిక ఎలాగ ఉండాలంటే నేను ఒక చాక్లెట్ తయారు చేసే ఫేక్టరీ పెట్టాలి. అదీ కోరిక. అర్ధమయిందా!" అందరూ ఎవరికి వాళ్ళే గతుక్కుమన్నారు. అందరూ అలాగే రాసారు.

"ఇప్పుడు బాగా ఆలోచించి మరీ, చెప్పండి మీ కోరికలు ఏమిటో?" అరగంట తరువాత.. "వాసూ నీ కోరిక ఏమిటిరా?" "నాకు బడికి వెళ్ళడానికి కారు కావాలి." అందరూ పుసుక్కున నవ్వారు. వాడికి సైకిలు కూడా లేదు. మాష్టారు మాత్రం మెచ్చుకున్నారు. "కోరిక అంత బలంగా ఉండాలిరా! అప్పుడే మనకు దానిని సాధించాలనిపిస్తుంది. లక్ష్మి నీ కోరిక?" "నాకు ప్లాటినములో ఉన్న వజ్రాల నెక్లెస్ ....... కాదు, కాదు మొత్తం వజ్రాల సెట్ కావాలి." తనకి మెడలో వేసుకోడానికి రోల్డ్ గోల్డ్ చైను కూడా లేదు. అయినా ఈ సారి ఎవరూ నవ్వలేదు. "నాకు పెద్ద డాక్టరిని అవాలని ఉంది." "విమానాలు నడపాలి." "బోలెడు డబ్బు సంపాదించి పెద్ద ఇల్లు కట్టాలి." ఇలా ఒకరి తరువాత ఒకరు కోరికల చిట్టా విప్పారు. "శభాష్. విషయం మీకు బాగా అర్ధమయింది. ఇప్పుడు మీకు పుస్తకాలు ఇస్తాను. మీరు చెప్పిన మీ కోరికలు ఏమిటో ఈ రోజు తారీఖు వేసి మీ పుస్తకాల్లో రాయండి. అయితే ... కోరికలు బాగా ఉన్నాయి. అవి తీరాలంటే?" మాష్టారి ప్రశ్న. "డబ్బు ఉండాలి" అందరూ కోరస్ గా చెప్పారు. "అది కావాలంటే ఉద్యోగం చెయ్యాలి" ఈ సారి గొణిగారు ఒకరు. "ఉద్యోగం చేస్తే అంత పెద్ద కోరికలు ఎప్పటికి తీరుతాయి. వ్యాపారం చెయ్యాలి." ఇంకొక పక్కనుండి, వాళ్ళ మాట మీద వాళ్ళకే నమ్మకం లేక నెమ్మదిగా అన్నారు ఎవరో.

"గరిష్టంగా రెండు కోట్లు ఇచ్చి ఐ ఐ టి విద్యార్ధిని ఉద్యోగము లోకి తీసుకున్న బహుల జాతి సంస్థ. ఈ సారి అంతే మొత్తాలలో ఉద్యోగంలో చేరిన ఐ ఐ ఎం విద్యార్ధులు." వార్తా పత్రిక తీసి చదివారు మాష్టారు గారు. "రెండు కోట్లా!" అందరూ నోళ్ళు వెళ్ళబెట్టారు. "మాష్టారూ రెండు కోట్లు ఎన్ని సంవత్సరాలకు?" సందేహం వెలిబుచ్చాడు రవి. "ఒక్క సంవత్సరానికేరా." "ఒక్క సంవత్సరానికి రెండు కోట్లా!" "ఇప్పుడు అర్ధమయిందా! మీ కోరికలు తీరాలంటే ఏం చెయ్యాలో?" అర్ధమయీ , కానట్టు ఉంది. "ఇప్పటికి ఏడెనిమిదేళ్ళ తరువాత మీ గురించి అలాగే వార్తల్లో రావాలి తెలిసిందా!" ఇంకా ఏడెనిమిదేళ్ళా! ఉత్సాహం చల్లారిపోయింది అందరిలో. మాష్టారు అందరిని కలయచూసారు. నవ్వుకుంటూ "ఒరే రాజూ నువ్వెప్పుడు గోళీలు మొదటిసారి ఆడావు?" అడిగారు. "ఒకటో క్లాసులో మాష్టారూ." "నీకెప్పుడు నేర్చుకున్నట్లు అనిపిస్తుంది." "నిన్న కాక మొన్నే నేర్చుకున్నట్లు అనిపిస్తుంది" నెమ్మదిగా తల గోక్కుంటూ చెప్పాడు వాడు. "ఒరే శ్యాం మీరు ఈ ఊరు

ఎప్పుడొచ్చారురా?" "ఆరేళ్ళయింది గానీ నాకూ అలాగే అనిపిస్తుంది" అనేసాడు వాడు కూడా. "కాలం ఎప్పుడూ ఒకేలా నడుస్తుంది. మనం పనిలో ఉంటే కాలం తొందరగా గడిచి పోతుంది. మనకు నచ్చిన పనులైతే కాలం ఇంకా తొందరగా గడిచి పోతుంది. అదే మనకు ఇష్టం లేనిదైతే కాలం భారంగా కదలనట్లు అనిపిస్తుంది." "అవును మాష్టారూ! మా బామ్మ ఏమో ఇంకా పొద్దు గడవ లేదు అంటుంది. మా అమ్మ ఏమో అబ్బా! అప్పుడే సాయంకాలం అయిపోయిందా అంటుంది. మా బామ్మకు చేసే పనిలేక కాలం గడవదు. మా అమ్మకు పనిలో కాలం అయేది తెలియదు" అంది శ్యామల.

ఇప్పుడు అందరికీ బాగా అర్ధమయింది. "మీరు చదువు పై శ్రద్ధ పెడితే ఏడెనిమిదేళ్ళు ఇట్టే గడిచి పోతాయి. మీరు ఎలా చదువుతారు అన్నదానిని బట్టి మీ కోరికలు తీరే మార్గం ఉంటుంది అర్ధమయిందా!" అందరూ తలూపారు ఒక్క రాజు తప్ప. పదో తరగతి తరువాత వాడిని చదివించననేశాడు వాళ్ళ నాన్న. అసలు వాడు ఇక్కడ వరకూ రావడమే గొప్ప. "నీ బాధ అర్ధమయిందిరా కానీ దానికీ ఒక ఉపాయం ఉంది." మరల వాడిలో ఆశ. "నువ్వు మంచి మార్కులు తెచ్చుకుని మన స్కూలికి ఫస్ట్ వచ్చావనుకో, ఇంకా బాగా చదివి మన జిల్లాకే ఫస్ట్ వచ్చావనుకో నిన్ను ఫ్రీగా చదివించడానికి ప్రైవేటు కాలేజిలు పోటీ పడతాయి." "నిజంగానా మాష్టారూ!" "నిజమేరా." " ఒరే అయితే స్కూలు ఫస్ట్ నాదేరా. మీరెవరూ ఆశలు పెట్టుకోకండి. నేనే మన స్కూలు ఫస్ట్" చాలా నమ్మకంగా చెప్పాడు. మాష్టారి కళ్ళల్లో వెలుగు. "శిష్యుడంటే ఇలాగ ఉండాలి. కోరిక తీరాలనే ధృడమైన సంకల్పం, తన మీద తనకి చెదరని విశ్వాసం ఉంటే సాధించలేనిది ఏదీ ఉండదు. ఇంకా మూడు నెలలు ఉన్నాయి. పదో తరగతి పరీక్షలకు. మన స్కూలులో మొదటి పది రేంకులూ మీకే రావాలి. ఈ రోజు నుండీ చదవడం మొదలుపెట్టండి." రాబోయే రేంకులు ఊహించుకుని అందరూ గాలిలోనే ఉన్నారు ఆ రోజు.

రాజు లాంటి వాళ్ళే గురువుల పేరు నిలబెడతారు అని ఆ రోజు నుండి వాడంటే మాష్టారికి ప్రత్యేకమయిన అభిమానం. వాసు పక్కనుండి పొడుస్తుంటే జ్ఞాపకాల నుండి బయటపడ్డాను. "చూడు వాడు ఎలా మాట్లాడుతున్నాడో. మాష్టారు అంటే వాడికి చాలా గౌరవమని" లోగొంతుతో అన్నాడు వాసు. "ఆ రోజే అనుకున్నాను నా గురించి కూడా వార్తల్లో రావాలని. మన మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం గారు చెప్పారు గొప్ప కలలు కనండి. అవి నిజమయ్యే వరకూ ప్రయత్నించండి అని. కాని కలలు కనాల్సిన వయసులో ఆ విషయం తెలియదు, మా మాష్టారు చెప్పే వరకూ. కలలు కనడం సహజం. అవి తీరాలనుకోవడం ఇంకా సహజం. మీరు చేయాల్సిందల్లా ఇష్టం మీద చదవడం అని చాలా సులువుగా అర్ధమయేటట్లు మాష్టారు ఆ రోజు చెప్పకపోయుంటే ఈ రోజు నేను నాకున్న ఎకరం పొలం దున్నుకుంటూ ఉండే వాడినేమో! మనలో మాష్టారు కోరికలను రగిలించారు. అవి తీరే వరకూ పోరాడడం నేర్పించారు. మాష్టారే లేకపోయుంటే నా జీవితం ఇంకోలా ఉందేది. నా జీవితం అద్భుతమైన మలుపు తిరగడానికి కారణమైన మాష్టారు గారికి నేను ఏం చేసినా ఆ ఋణం తీర్చుకోలేను." అందుకే కాబోలు ఏం చెయ్యకుండా ఉపన్యాసం దంచుతున్నాడు వాసులో కోపం. "చదువనే తాళం చెవి ద్వారా నీ కలల సౌధాన్ని తెరువు అని నాకు ఉద్బోధించి నా ఉన్నతికి కారణమయిన మా మాష్టారికి ఉడతా భక్తితో నా వందనం" అని మాష్టారికి పాదాభివందనం చేసి మాష్టారి పాదాల దగ్గర తాళాలు పెట్టాడు రాజు. చప్పట్లు మోగుతూనే ఉన్నాయి వాడు మాట్లాడుతుంటే. ఏమిటా తాళాలు? అందరిలోనూ ప్రశ్న.

అప్పుడు లేచాడు రవి. "క్షమించాలి. ఈ విషయం ఎవరికీ చెప్పనందుకు. నేను మాష్టారి సన్మానం గురించి చెప్పినప్పుడు

మాష్టారి పేరున ఒక ఇల్లు తీసుకో అని రాజు నాకు చెప్పాడు. ఆ ఇల్లు పూర్తికాకపోవడంతో రాజు ఇండియా వచ్చే తేదీ పొడిగించాల్సి వచ్చింది. అనుకోకుండా రాజు అన్నట్లు మనందరి జీవితాలనూ మలుపు తిప్పిన ఆ తేదీ నాడే ఈ రోజు మనం మన మాష్టారిని సన్మానించుకోవడం మన అదృష్టం. రాజుకి ఈ విషయం ఎవరికీ తెలియడం ఇష్టం లేదు. కాని గురు శిష్యుల సంబంధం ఎలా ఉండాలో ఇప్పటి పిల్లలకు తెలియ చేయడం కోసం నేను రాజుని బలవంతంగా ఒప్పించాను. తరగతి గది దాటినవెంటనే గురువులను ఎవరో అన్నట్లు చూస్తున్న ఇప్పటి విధ్యార్ధులకు, గురువులు శిష్యులను ఎంత ఉన్నతంగా చూడాలనుకుంటారో, పాటిస్తే గురువుల ఉద్బోధ శిష్యులను ఎంతటి ఉన్నత శిఖరాలకు చేరుస్తుందో, గురువులను ఏ రకముగా మన్నించుకోవాలో తెలియచెప్పడం కోసం ఈ రకముగా చేయాల్సి వచ్చింది." రవి మాట్లాడుతున్నాడు.

వీడిలాంటి వాళ్ళే గురువుల పేరు నిలబెడతారు అని రాజు అంటే మాష్టారికి వల్లమాలిన అభిమానం. గురువుకి శిష్యులందరి మీద అభిమానం ఉంటుంది. కాని కొంతమంది మీద కొంచెం ఎక్కువ అభిమానం ఉంటుంది ద్రోణునికి అర్జునినిలా. అలాగే నాకు రాజు అంటే కొంచెం ఎక్కువ అభిమానం. అందరిలా కాదు వాడు ప్రత్యేకం రా అనే వారు. అప్పుడు ఆ మాటలకు అర్ధం తెలియలేదు. ఇప్పుడు తెలిసింది మాష్టారికి రాజు మీద అంత నమ్మకం ఎందుకో. ఎందుకంటే వాడు మిగిలిన వాళ్ళమీద ప్రత్యేకమే కాబట్టి. నేను, వాసు, మాలాగే రాజుని అపార్ధం చేసుకున్న మరికొందరు రాజుని ఎత్తుకుని గాలిలోకి ఎగరేసాము ఆనందంగా.

అంకితం: మనుషులను డబ్బుతో కాకుండా మమతలతో కొలవడం నేర్పించిన నా తల్లితండ్రులకు ఈ కథ అంకితం.




రామం, విశ్వం, సూర్యం ముగ్గురు ఒకే కంపెనీలో పనిచేస్తారు. మంచి మిత్రులు. ఒకరి ఇంటికి ఒకరు తరుచూ వెళ్తూ వుండడం వల్ల ఒకరి బంధువులు ఇంకొకరికి తెలుసు. వాళ్ళ పిల్లలు ఆరుగురూ కూడా మంచి స్నేహితులు. మూడు కుటుంబాలు కలిసి సినిమాలకు వెళ్ళడం, కార్తీకమాసం పిక్నిక్ లకు , యాత్రలకు వెళ్ళడం వంటివి కూడా చేస్తూ వుంటారు.

వాళ్ళ ఆఫీస్ దగ్గర్లో ఎప్పటి నుండో ఖాళీగా వున్న ఒక స్థలాన్ని చదును చెయ్యడం, ఎవరో ఒక వ్యక్తి రోజూ కార్లో వస్తూ వుండడం చూసిన రామానికి ఆ స్థలం డెవలప్ మెంట్ కి ఇచ్చారేమో అనిపించింది. ఆ రోజు మధ్యాహ్నం అంతా రామానికి అక్కడ ఫ్లాట్స్ వస్తే ముగ్గురు ఫ్రెండ్స్ కలిసి అందులో ఫ్లాట్ బుక్ చేసుకుంటే బాగుంటుందనే ఆలోచన వచ్చింది. సాయంత్రం ఆఫీసు నుండి బయటకు వస్తూ రామం మిత్రులిద్దరికీ తన ఐడియా గురించి చెప్పాడు. విశ్వం , సూర్యం కూడా ఐడియా బాగుందిరా, ఆఫీస్ కీ దగ్గర అన్నారు.

పక్కరోజు రామం కాపలా కాసి ఆ కార్లో వచ్చిన ఆయనను పట్టుకున్నాడు. అతని ఊహే నిజమయ్యింది. ఆ స్థలం లో అపార్ట్ మెంట్ రాబోతోంది. ఆనందంతో 'యాహూ' అని అరవాలనిపించింది రామానికి. ఆ ఆదివారం గెట్ టు గెదర్ పెట్టుకుని మూడు కుటుంబాలు కలిసాయి. ఫ్లాట్ బుక్ చెయ్యడం గురించి చర్చించారు. ఆడవాళ్ళు , మగవాళ్ళు , పిల్లలు మూడు బ్యాచ్ లుగా విడిపోయారు. ఎవరి స్థాయిలో వారు ఊహల్లో ఎక్కడికో వెళ్ళిపోయారు.

ఎంచక్కా పొద్దున్నే ముగ్గురు కలిసి వాకింగ్ కి వెళ్ళొచ్చు. పిల్లలని ట్యూషన్ కి తీసుకెళ్ళి, తీసుకురావడం ఒకళ్ళు, కూరలు , పళ్ళు తేవడం ఒకళ్ళు, బిల్లులు కట్టడం , సరుకులు తేవడం ఒకళ్ళు, ఇలా పనులు పంచుకుంటే టైం చాలా ఆదా అవుతుంది. హాయిగా వుండొచ్చు అనుకున్నారు మగవాళ్ళు. గుడికి వెళ్ళాలన్నా, షాపింగ్ కి వెళ్ళాలన్నా కలిసి వెళ్ళొచ్చు. ఎప్పుడన్నా ఏ ఫక్షన్కి ఆడవాళ్ళు ఒక్కరే ఊరు వెళ్తే ఎవరో ఒకళ్ళు ఆ ఫ్యామిలికి భోజన ఏర్పాట్లు చూడొచ్చు. అసలు ఇబ్బంది వుండదు అని సంతోషపడిపోయారు ఆడవాళ్ళు. స్కూల్ కి ఒకే ఆటోలో వెళ్ళొచ్చు, సాయంత్రం మేడ మీద కలిసి ఆడుకోవచ్చు అని ఎగిరి గెంతులేసారు పిల్లలు.

ఇంక ఏ మాత్రం ఆలస్యం చేయకుండా పక్కరోజే బిల్డర్ ని అడిగి ప్లాన్ తీసుకున్నాడు రామం. ఆఫీస్ బ్రేక్ టైం లో కూడా ఫ్లాట్ గురించే చర్చ. లక్కీగా ఫ్లోర్ కి మూడే ఫ్లాట్లవడం తో వాళ్ళ ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఒక ఫ్లోర్ మొత్తం మనమే వుంటాము అనుకుని ఆ వారమే ముగ్గురికీ కలిపి ఒక ఫ్లోర్ బుక్ చేశారు. ఆ నెలలోనే శంకుస్థాపన జరిగింది. ఫ్రెండ్స్ ముగ్గురూ హాజరయ్యారు. అపార్ట్ మెంట్ పని చకచకా జరుగుతోంది. స్లాబ్లు, గోడలు , ఇంటీరియర్ ఇలా మూడేళ్ళలో అపార్ట్ మెంట్ నిర్మాణం పూర్తి అయ్యింది. ఎవరి పేరు బలాన్ని బట్టి వాళ్ళ ముగ్గురూ మాఘమాసం లో గృహప్రవేశం అయ్యారు. ఎలా అయితేనేం ముగ్గురూ సామాన్లు అన్నీ చేరేసుకుని ఇల్లు సర్దేసుకునేసరికి పిల్లల పరీక్షలు రానే వచ్చాయి. పిల్లలు, పెద్దలు చదివి పరీక్షలు పూర్తిచేసారు. మూడు బ్యాచ్ లు , ఆడవాళ్ళు , పిల్లలు , మగవాళ్ళు ఎవరు ఊహించుకున్నట్లు వాళ్ళు జీవితాన్ని చక్కగా ఎంజాయ్ చేస్తున్నారు.

ఇంతలో సునామి ఏ రూపం లో వచ్చిందటే సూర్యం వాళ్ళ మామగారికి హార్ట్ ఎటాక్ అని ఫోన్ వచ్చింది. సూర్యం భార్య పద్మిని ఒక్కతే కూతురు కావడం వల్ల తను గోలగా వుంటుందని పిల్లల్ని ఇక్కడే వుంచెయ్యమని , తను చూసుకుంటానంది రామం భార్య

జానకి. సూర్యం, పిల్లలు ఒక వారంపాటు రామం వాళ్ళింట్లోనే టిఫిన్, భోజనం. ఒకసారి చేసింది, మరొకసారి చెయ్యకుండా రోజుకో రకం చేస్తోంది జానకి. ఇడ్లీలు, గారెలు గట్టిగాను, ఉప్మా జావ గాను , చట్నీ లో ఉప్పుంటే పులుపుండదు, లేదంటే విపరీతమైన కారం, కళ్ళమ్మట నీళ్ళు తిరిగేవి. అసలే పద్మిని వంట చాలా బాగా చేస్తుంది. ఆ రుచులు అలవాటై పిల్లల్ని నైమంత్, టెంత్ హాస్టల్ లో పెడదామన్నా వాళ్ళు ససేమిరా వెళ్ళం అని మొండికేశారు. టిఫిన్లే ఇలా వుంటే భోజనం గురించి ఏం చెప్పాలి. అన్నం ఒక రోజు బిరుసుగా వుంటే ,ఒకరోజు తోపల వుంటుంది. దానిలో ఊరగాయ పచ్చడి వేసుకున్నా రుచి తెలియదు. ఈ సమస్య నుండి ఎలా బయటపడాలో సూర్యానికి, పిల్లలకి అర్ధంకాలేదు. పోనీ విశ్వం వాళ్ళింటికి వెళ్దామంటే విశ్వం భార్య లక్ష్మి చాలా నిదానం గా పని చేస్తుంది. వాళ్ళింటి వరకు వాళ్ళ పనిచేసుకోవడమే గగనం. ఇంక అదనం గా ఏం చెయ్యగలదు?

మధ్యలో రెండు రోజులు సూర్యం బయట ఏదో పని వుందనో , ఊరి నుండి వచ్చారు, వాళ్ళని ఎంగేజ్ చెయ్యాలి అని మేనేజ్ చేసాడు కానీ ఎన్ని రోజులు చెయ్యగలడు? ఒక పక్క జానకి నా వంటకి భయపడి మీరు ఇంటికి రావడం మానేస్తున్నట్లున్నారు అన్నయ్యా అంటుంది. భోజనానికి కూర్చుంటే ఒక పక్క ముద్ద దిగదు, ఇంకో పక్క ఇంకొంచెం వేసుకోండి అన్నయ్యా అని జానకి ఎక్కువెక్కువ వడ్డించేస్తుంది. దీనితో కక్కలేక , మింగలేక అన్నట్లు సూర్యం పడే బాధ వర్ణనాతీతం. ఎప్పుడెప్పుడు పద్మిని వస్తుందా అని ఎదురుచూస్తున్నారు సూర్యం, పిల్లలు. ఈ లోపు లక్ష్మి తమ్ముడి పెళ్ళి కుదిరింది. పది రోజుల్లోనే పెళ్ళి , తరువాత ముహూర్తాలు లేవు అని కబురు వచ్చింది. లక్ష్మి పిల్లల్ని తీసుకుని బయల్దేరింది. లక్ష్మి వాళ్ళ ఊరు పద్మిని వాళ్ళ ఉరు దగ్గరే. లక్ష్మి వాళ్ళమ్మగారు పద్మినిని , టైం ఎంతో లేదమ్మా, మీ నాన్నగారికి తగ్గింది, పిల్లలకి సెలవేగా , నువ్వు ఈ పది రోజులు ఇక్కడే వుంటే మాకూ సాయం గా వుంటుందని ఒప్పించారు.

ఈ వార్త విన్న సూర్యానికి తలమీద పిడుగు పడ్డట్లయింది. బాధితుల జాబితాలో కొత్తగా విశ్వం చేరాడు. విశ్వం స్వతహాగా భోజన ప్రియుడు. ఎప్పుడూ లక్ష్మిని బెండకాయ కొబ్బరివేసి వండు. వంకాయ మెంతికూర చెయ్యి, గుమ్మడికాయ పులుసుపెట్టు అని బజార్లో కనబడ్డ కూరలన్నీ తెచ్చి , ఏ కూర ప్రత్యేకం గా ఎలా వండాలో చెబుతాడు. అలాంటి విశ్వం జానకి వంటకి బలైపోయాడు. అన్నయ్యా మీకు వంకాయ కూర ఇష్టం అంట గదా, లక్ష్మి చెప్పింది అని జానకి వంకాయ వారోత్సవం మొదలుపెట్టింది. వంకాయ బగారా పుస్తకం చూసి చేశాను, గుత్తి వంకాయ కూర టీవీ లో చూసి చేశాను అని ఇలా వారం రోజులు ఏదో రకం వంకాయ వండి పెట్టింది జానకి.

కాశీ వెళ్ళిన వాళ్ళు ఇష్టమైనది ఏదో ఒకటి వదిలేస్తారంట, కాశీ వెళ్ళకుండానే ఇక్కడే వంకాయ వదిలేసేటట్లుందిరా నా పరిస్థితి. చిత్రహింస , గృహ హింస ఇలా ఎన్నో రకాల హింసలు విన్నాను, కానీ ఈ పాకహింస ఏంటిరా బాబూ అని విశ్వం , సూర్యం దగ్గర వాపోయాడు. ఇన్నాళ్ళూ చెప్పుకునే నాధుడు లేడని బాధపడుతున్న సూర్యం ఒక్కసారే బావురుమన్నాడు. ఇన్నేళ్ళు రామం ఎలా భరిస్తున్నాడు, ఈ వంటని అనుకున్నారు ఇద్దరూ. ఒకే దగ్గర ఫ్లాట్స్ తీసుకుందామన్న ఐడియా రామానికి ఏల రావలె మనమేల అంగీకరించవలె అని తలబాదుకున్నారు ఇద్దరూ.

బ్రతుకుజీవుడా అని బావమరిది పెళ్ళికి వెళ్ళి వస్తూ అందరినీ వెంటబెట్టుకు వచ్చాడు విశ్వం. ఎప్పుడూ లేనిది ఈ సారి ఇంట్లో ఘన స్వాగతం లభించింది పద్మినికి. పెద్దగా చుట్టాల్ని ఇష్టపడక ఏ పెళ్ళో, పేరంటమో వచ్చినా , పద్మినిని పంపేసే సూర్యం పద్మినీ ఇకనుండీ ఏదన్నా ఊరెళ్ళాలంటే నేను వెళ్ళొచ్చేస్తాను, మమ్మల్ని వదిలి వెళ్ళకు, జానకి వంట తినలేక చచ్చాం అన్నాడు. అమ్మా ఆంటీ వంట ఒక వారం తినగలిగితే ఏ హాస్టల్ లోనైనా వుండిపోవచ్చు, మేము ఈ సంవత్సరం మీరు చెప్పినట్లే హాస్టల్ కి వెళ్తాం అన్నారు నైంత్ కి రాబోయే కవలలిద్దరు. ముసి ముసి నవ్వులు నవ్వింది పద్మిని.

ఎప్పుడూ ఆ వెరైటీ వండు, ఈ వెరైటీ వండు అని తినడం కోసమే బ్రతకడం లా వుండే విశ్వం బతకడం కోసమే తినడం లా అయిపోయాడు. ఏం వండినా మీరు మాట్లాడకుండా తినేస్తున్నాడు. ఒక్క ఐడియా .. జీవితాన్నే మార్చేస్తుంది అనే యాడ్ చూసి ఏదో అనుకున్నాం కానీ నిజం గా తమ ఐడియాకి ఇంత మార్పు వస్తుంది అని ఊహించలేదు ఆడవాళ్ళు ముగ్గురూ. పద్మిని నాన్నగారికి హార్ట్ ఎటాక్ రావడం వట్టిదే అని గానీ, కావాలని జానకి ఈ పదిహేను రోజులు అలా వండిందని గానీ ఆడవాళ్ళు ముగ్గురూ కలిసి రామం నోరు నొక్కేసారని గానీ విశ్వానికి, సూర్యానికి తెలియదు.